టీజీ ఐపాస్‌కు 1385 దరఖాస్తులు

కామారెడ్డిటౌన్, ఏప్రిల్2 (ఆంధ్రజ్యోతి): టీజీ ఐపాస్‌కు 1385 దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ లాల్‌నాయక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో 1,336 పరిశీలించగా 1,135 ఆమోదం పొందాయని, 189 వివిధ కారణాలతో తిరస్కరించబడ్డాయని పేర్కొన్నారు. టీప్రైడ్ స్కీమ్ కింద 3 దరఖాస్తులకు మంజూరైన పెట్టుబడి రాయితీ రూ.6కోట్ల 92లక్షల 492 అని, టీఎస్‌పీకి 14 దరఖాస్తులు రాగా పెట్టుబడి రాయితీ రూ.44,17,684 మంజూరైనట్లు తెలిపారు.

జొన్నల కొనుగోలు
కేంద్రాలేవీ?



• కేంద్రాలకు తెచ్చిన జొన్నలు



• పంటను నూర్పిడి చేస్తున్న రైతులు

- నేటికీ ఏర్పాటుకాని జొన్నల కొనుగోళ్లు
- కేంద్రాలు లేక దళారులను ఆశ్రయిస్తున్నరైతులు
- ప్రైవేటు మార్కెట్‌లో క్వింటా జొన్న ధర రూ.రూ.2200
- మద్దతు ధర క్వింటాకు రూ.3371
- రూ.వెయ్యి వరకు నష్టపోతున్నరైతులు
- ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతుల డిమాండ్
- జిల్లాలో 20వేల ఎకరాలకు పైగా జొన్నపంట సాగు

కామారెడ్డి, ఏప్రిల్2 (ఆంధ్రజ్యోతి): ఆరుతడి పంటలను సాగు చేయాలని ఓ వైపు ప్రభుత్వం చెప్తున్నా ఆ పంట ఉత్పత్తులను కొనుగోలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని రైతులు మండిపడుతున్నారు. జిల్లాలో నీటి లభ్యత లేకపోవడంతో పలు ప్రాంతాల్లో రైతులు వరికి ప్రత్యామ్నాయంగా జొన్న, మొక్కజొన్న, శనగ, కంది పంటలను సాగుచేస్తుంటారు. అయితే ఈ యాసంగిలో జిల్లాలో వేల ఎకరాలలోనే జొన్నపంటను రైతులు సాగుచేశారు. దిగుబడులు బాగానే వచ్చినప్పటికీ మార్కెట్‌లో జొన్న పంటను కొనుగోలుచేసే నాథుడే లేకపోయాడు. ప్రతిఏటా జొన్న పంటను ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలుచేసేది. కొనుగోళ్ల కోసం ప్రభుత్వం ఎలాంటి నిర్ణయమూ తీసుకోకపోవడంతో రైతులు చివరకు దళారులనే ఆశ్రయించాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. జొన్నల కొనుగోళ్లు ఆలస్యం కావడం ప్రభుత్వం సకాలంలో నిర్ణయం తీసుకోకపోవడంతో చాలామంది రైతులు తక్కువ ధరకే ప్రైవేట్‌కు, దళారులకు అమ్ముకుని తీవ్రంగా నష్టపోతున్నారు. జొన్నలను ప్రభుత్వమే మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

• జిల్లాలో 20 వేల ఎకరాలలో జొన్న పంట సాగు

జిల్లాలో ఆరుతడి పంటల్లోని సోయా, మొక్కజొన్న, శనగ తర్వాత ఎక్కువగా జొన్న పంటనే రైతులు సాగుచేస్తుంటారు. ప్రధానంగా సాగునీటి సౌకర్యం లేని ప్రాంతామైన జుక్కల్ నియోజకవర్గంలోని మద్నూర్, జుక్కల్, పెద్దకొడప్‌గల్, పిట్లం, బిచ్కుంద, నిజాంసాగర్, తాడ్వాయి, సదాశివనగర్, గాంధారి, రాజంపేట, రామారెడ్డి తదితర ప్రాంతాల్లో ఈ పంటను ఎక్కువగా రైతులు సాగు చేస్తుంటారు. ఈ యాసంగి సీజన్‌లో సుమారు 20వేల ఎకరాలకు పైగా పంటను సాగుచేశారు. ఎకరాన 15 క్వింటాళ్ల నుంచి 30 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తున్నాయని రైతులు, వ్యవసాయశాఖధికారులు చెబుతున్నారు. ఈ లెక్కన సుమారు 2.20 లక్షల క్వింటాళ్ల వరకు జొన్న దిగుబడులు వచ్చే అవకాశం ఉంది. అయితే ఇప్పటికే ఈ పంట కోతలు ప్రారంభం కావడం నూర్పిడీ చేసి జొన్నలను రైతులు మార్కెట్‌కు తరలిస్తున్నారు. కానీ జొన్న కొనుగోలు కేంద్రాలు మాత్రం ప్రారంభం కాలేదు.

• దళారులే దిక్కు

జొన్నపంట సకాలంలో చేతికి వచ్చినప్పటికీ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. గత ఏడాది ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో జొన్నలను కొనుగోలు చేసింది. ఇందుకోసం జిల్లాలో 15కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల నుంచి మద్దతు ధరకు కొనుగోళ్లు చేపట్టారు. కానీ ప్రభుత్వం ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులకు దళారులే దిక్కవుతున్నారు. ప్రభుత్వం నుంచి కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో దళారులను రైతులు ఆశ్రయిస్తూ విక్రయించాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ఇదే ఆసరాగా తీసుకుని దళారులు ప్రైవేట్ వ్యాపారులు జొన్నలను తక్కువ ధరకు కొంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

• క్వింటాకు రూ.1000 చొప్పున దోపిడీ

జిల్లాలో ఆయా మండలాల్లో రైతులు జొన్న పంటను కొసి నూడీ చేసే పనిలో బీజీగా మారారు. కొన్ని ప్రాంతాల్లో జొన్నపంట చేతికి వచ్చింది. దీంతో రైతులు జొన్నలను మార్కెట్‌లోకి తీసుకువస్తున్నారు. తీరా మార్కెట్ యార్డులో కేంద్రాలు లేకపోవడంతో కుప్పలుగా పోసి రోజుల తరబడి కాపాల కాయాల్సి వస్తోంది. ప్రభుత్వం తరఫున కేంద్రాలను ఏర్పాటుచేస్తారని చూస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంలేదు. దీంతో జొన్నలను దాచుకోలేక దళారులను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.3371 ఉంది. ప్రైవేట్ వ్యక్తులు క్వింటాల్‌కు రూ.2200 నుంచి రూ.2300 వరకు కొనుగోలు చేస్తున్నారని రైతులు చెబుతున్నారు. దళారులకు ప్రైవేట్ వ్యక్తులకు విక్రయిస్తే క్వింటాల్‌కు రూ.1000 వరకు దోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే జొన్నలు నాణ్యత లేవని అమ్మితే అమ్మండి లేకుంటే తీసుకెళ్లండి అంటూ బదిలీస్తున్నారని రైతులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి జొన్నల కొనుగోలు చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

కొనుగోళ్లకు సిద్ధంగా ఉన్నాం.

• మహేష్‌కుమార్, మార్క్‌ఫెడ్ డీఎం, కామారెడ్డి

జిల్లాలో జొన్నల కొనుగోళ్లకు మార్క్‌ఫెడ్ సిద్ధంగా ఉంది. ప్రభు త్వం నుంచి జొన్నల కొనుగోళ్లకు ఆదేశాలు రావడమే తరువాయి. వ్యవసాయశాఖ సుమారు 2లక్షల క్వింటాళ్ల వరకు జొన్నల దిగుబడులు వస్తాయని నివేదించింది. అందుకు అనుగుణంగా రైతుల నుంచి జొన్నలు కొనుగోలు చేసేందుకు కేంద్రాల అనుమతి కోసం ప్రభుత్వానికి నివేదించాం. గతఏడాది జిల్లాలో 15 కేంద్రాలను ఏర్పాటు చేసి 20 వేల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు చేశాం. ఈసారి కూడా ప్రభుత్వం నుంచి అనుమతులు వస్తే కొనుగోలు చేపడుతాం. ఈ రెండు, మూడు రోజుల్లో ప్రభుత్వం కొనుగోళ్లపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.



ఉమ్మడి జిల్లాల ముఖ్యనేతలతో మాట్లాడుతున్న మాజీ సీఎం కేసీఆర్

జిల్లా బీఆర్‌ఎస్ నేతలతో కేసీఆర్ భేటి

- ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌లో సమావేశం
- పార్టీ రజతోత్సవ మహాసభకు దిశానిర్దేశం
- నియోజకవర్గాల నుంచి భారీగా కార్యకర్తలు, ప్రజలను సమీకరించాలని ఆదేశాలు
- జిల్లాలోని రాజకీయ పరిస్థితులపై ఆరా తీసిన కేసీఆర్

కామారెడ్డి, ఏప్రిల్2 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ పార్టీ రథోత్సవ మహాసభ ఏర్పాటు నేపథ్యంలో ఉమ్మడి నిజామాబాద్, మెదక్ జిల్లాల ముఖ్యనేతలతో పార్టీ అధినేత కేసీఆర్ బుధవారం ఎర్రవెల్లి ఫాంహౌస్‌లో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్‌రావు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాసులు హాజరు కాగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లానుంచి మాజీ మంత్రి ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యేలు గంపగోవర్ధన్, జాజాల సురేందర్, హన్మంత్‌షిండే, జిల్లా అధ్యక్షుడు ముజిబొద్దిన్, నిజామాబాద్ జిల్లా మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, బిగాల గణేష్‌గుప్తా, జీవన్‌రెడ్డి పాల్గొన్నారు. వరంగల్‌లో నిర్వహించే బీఆర్‌ఎస్ రజోత్సవ మహాసభలకు జిల్లాలోని ఆయా నియోజకవర్గాలకు పెద్దమొత్తంలో పార్టీ నేతలు, కార్యకర్తలు అభిమానులు, అన్ని వర్గాల ప్రజలను తరలించేందుకు సిద్ధం చేసుకోవాలని మాజీ సీఎం కేసీఆర్ ఆదేశించారు. అదేవిధంగా అధికార పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను వంచించిందని, ప్రజల వ్యతిరేక విధానాలపై ప్రభుత్వాన్ని ఎప్పటికప్పుడు ఎండకట్టాలని నేతలకు పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో ఆయా జిల్లాలో బీజేపీ క్షేత్రస్థాయిలో మరింత బలాన్ని పెంచాలని పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ భరోసా నింపాలని సూచించారు. అదేవిధంగా ఆయా నియోజకవర్గాల్లో తాజా రాజకీయ పరిస్థితులపై ఆయా నేతలను, మాజీ ఎమ్మెల్యేలను కేసీఆర్ ఆరాతీశారు. జిల్లాలోని కామారెడ్డి నియోజకవర్గంలో తనను, ఎల్లారెడ్డిలో జాజాల సురేందర్‌ను, జుక్కల్‌లో హన్మంత్‌షిండేను ఓడించి ఏం నష్టపోయారో నియోజకవర్గ ప్రజలకు ఇప్పుడు తెలిసి వచ్చిందని, ప్రస్తుతం ఇప్పుడు బీఆర్‌ఎస్ మాజీ ప్రజాప్రతినిధుల అవసరం ఆయా నియోజకవర్గ ప్రజలకు తెలుస్తుందని పేర్కొన్నారు. కష్టపడి పని చేయండి భవిష్యత్తు బీఆర్‌ఎస్ నేతలదేనని కేసీఆర్ సూచించారు.



లింగంపేట్‌లో ఘనంగా రథోత్సవం

• ఉత్సవాల్లో భాగంగా ఆలయం వద్ద కుస్తీ పోటీలు

..... వివరాలు 7లో

రవాణాశాఖ ఆదాయంలో
జిల్లాకు రెండోస్థానం

- 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.68.19కోట్ల ఆదాయం
- గత సంవత్సరం కంటే 5.03 కోట్లు పెరిగిన ఆదాయం



కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న రవాణా శాఖ అధికారులు

కామారెడ్డి టౌన్, ఏప్రిల్2 (ఆంధ్రజ్యోతి): 2024-25 ఆర్థిక సంవత్సరానికి రవాణా శాఖ లక్ష్యసాధనలో రాష్ట్రస్థాయిలోనే కామారెడ్డి జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచిందని జిల్లా రవాణాశాఖాదికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం రవాణాశాఖ కార్యాలయంలో ఉద్యోగులు, సిబ్బందితో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 2023-24 సంవత్సరంలో రవాణాశాఖకు రూ.63.16 కోట్ల ఆదాయం సమకూరితే ప్రస్తుతం 2024-25లో నిర్దేశిత లక్ష్యం రూ.73కోట్లు కాగా రూ.68.19 కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు. గత సంవత్సరం కంటే రూ.5.03 కోట్లు ఆదాయం పెరిగిందని లక్ష్యసాధనలో 92.04 శాతం సాధించి రాష్ట్రంలోనే ద్వితీయస్థానంలో నిలిచామని తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీల ద్వారా రూ.9.63 కోట్లు వచ్చిందని, గ్రీన్ ట్యాక్స్ రూ.79.83 లక్షలు, సర్వీస్ చార్జ్ రూ.2.16 కోట్లు, ఫీజుల ద్వారా రూ.7.35కోట్లు, లైఫ్‌ట్యాక్స్ రూ.38.34కోట్లు, త్రైమాసిక ట్యాక్స్ ద్వారా రూ.9.88కోట్లు ఆదాయం సమకూరిందని తెలిపా రు. సిబ్బంది పనితీరు మెరుగ్గా ఉండడంతోనే ఈ ఆదాయం సమకూరిందని తెలిపారు. కార్యక్రమంలో ఎంవీఐ శ్రీనివాస్, ఆర్‌టీఏ మెంబర్ ఎజాజ్ అహ్మద్, ఏఎంవీఐలు భిక్షపతి, అఫ్రోజ్, సురేష్ పాల్గొన్నారు.



శిథిలావస్థకు చేరిన సిమెంట్ నర్సరీలు ఇవే..

చేపపిల్లల ఉత్పత్తి కేంద్రం
పునర్నిర్మాణమయ్యేనా!?

- రూ.4 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- నిధుల మంజూరుకు గ్రీన్ సిగ్నల్ వచ్చేనా?
- అందరిచూపు చేపపిల్లల ఉత్పత్తి కేంద్రం వైపు

.... వివరాలు 7లో

ముగిసిన పదో తరగతి పరీక్షలు

కామారెడ్డిటౌన్, ఏప్రిల్2 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లాలో బుధవారం వరకు పదో తరగతి పరీక్షలు ముగిసినట్లు డీఈవో రాజు తెలిపారు. మొత్తం 12,579 మందికిగాను 12,550 హాజరైనారని తెలిపారు. గతంలో పరీక్షలు తప్పిన వారిలో నలుగురు ఉండగా ఇద్దరు మాత్రమే హాజరయ్యారని తెలిపారు. జిల్లాలో పరీక్షలనుప్రశాంతంగా జరిగేటట్లు కృషిచేసిన ఉపాధ్యాయులు, సిబ్బంది ఇతరశాఖల అధికారులను అభినందించారు. జుక్కల్ ప్రభుత్వ పాఠశాలలో మాత్రమే ప్రశ్నాప్రతాల లీకుకు సంబంధించి ఘటన చోటుచేసుకుంది. ప్రశ్నాప్రతాల లీకులకు సంబంధించి వ్యక్తులను సైతం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. మిగిలిన అన్ని చోట్ల పరీక్షలు ప్రశాంతంగానే కొనసాగాయి.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలి

• జిల్లాస్థాయి సాండ్ కమిటీ సమావేశంలో కలెక్టర్

కామారెడ్డి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. జిల్లాస్థాయి సాండ్ కమిటీ సమావేశాన్ని బుధవారం కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎక్కడైతే స్థానికంగా 1, 2, 3 ఆర్డర్ కాలువలలో ఇసుక లభ్యత ఉందో అక్కడ ఇరిగేషన్‌శాఖ సహాయం తీసుకుని తహసీల్దార్లు ఇసుకను స్థానిక అవసరాలకు సరఫరా చేసేందుకు అనుమతివ్వాలని అన్నారు. ఇసుక అక్రమరవాణాను అడ్డుకోవడానికి ఇదివరకే ఉన్న తనిఖీ ప్రదేశాలలో ఉన్న రెవెన్యూ సిబ్బందికి తగిన పోలీస్ సిబ్బంది నియమించాలని కలెక్టర్ జిల్లా ఇసుక కమిటీ ఛైర్మన్, పోలీస్‌శాఖను ఆదేశించారు. అక్రమ మట్టి తవ్వకాలను నిరోధించేందుకు సులభమైన పద్ధతిని అవాలంబించేందుకు ఏవైనా పద్ధతులు ఉంటే పరిశీలించాలని, తద్వారా తహసీల్దార్‌లకు అనుమతి ఇవ్వడంపై వివరించారు.



అదనపు కలెక్టర్ విక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నిరుద్యోగులు

ఉద్యోగాల భర్తీలో అవకతవకల్లో
నిగ్గుతేలేనా?



కామారెడ్డి మెడికల్ కళాశాల

- మెడికల్ కళాశాలలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల భర్తీలో అవకతవకలు
- మెరిట్ లిస్ట్ చూపకుండానే నియామక పత్రాల అందజేత
- నిరుద్యోగుల ఆందోళనతో మెరిట్ లిస్ట్ ప్రదర్శన
- జాబితా చూసి అవాక్కైన దరఖాస్తుదారులు
- పత్రాలు అందుకున్న వారి ఒరిజినల్ సర్టిఫికెట్లు పరిశీలించాలని డిమాండ్

కామారెడ్డిటౌన్, ఏప్రిల్2 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మెడికల్ కళాశాలలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల భర్తీలో అవకతవకలు చోటుచేసుకున్నాయంటూ పలువురు నిరుద్యోగులు ఆందోళన చేసి ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందిస్తున్నారు. బుధవారం సైతం అదనపు కలెక్టర్ విక్టర్‌కు మరోమారు వినతిపత్రం అందించి మెరిట్ లిస్టులో గుర్తించిన అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలని న్యాయబద్ధంగా అర్హులైన వారికి ఉద్యోగాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని నిరుద్యోగులు, విద్యార్థి సంఘ నాయకులు కోరారు. ఇప్పటికే పలుమార్లు దరఖాస్తులు ఇస్తూ వస్తున్న నిరుద్యోగులు ఇప్పటికైనా ఈ విషయంలో నిగ్గుతేలేనా.. నీరుగారేనా అనే సందిగ్ధం వ్యక్తంచేస్తున్నారు. వారం రోజుల క్రితం మెడికల్ కళాశాలలో ఆయా పోస్టులకు ఎంపిక చేసిన వారికి నియామక పత్రాలు అందించినప్పటి నుంచి పెద్దఎత్తున అవకతవకలు జరిగాయని పేర్కొంటూ నిరుద్యోగులు అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. పోస్టుల భర్తీ ప్రక్రియలో నిబంధనలు పాటించలేదని ఆయాపోస్టులకు సంబంధించిన అన్నిఅర్హతలు ఉండడంతో అందుకు కావాల్సిన సర్టిఫికెట్లు అందించిన కావాలని మమ్మల్ని ఉద్యోగానికి దూరంచేశారని కొందరు పని అనుభవం, మార్కులకు సంబంధించి ఫేక్ సర్టిఫికెట్లు తెచ్చి ఇచ్చారని ఆరోపించారు. ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ అయిన సరే ప్రభుత్వ కార్యాలయాలు అయితే సంబంధిత కార్యాలయం వద్ద లేదంటే ఎంప్లాయిమెంట్ కార్యాలయం వద్ద దరఖాస్తులు తీసుకోవాల్సి ఉండగా ఇష్టారీతిన దరఖాస్తులు తీసుకుని ఇప్పుడు సరైనపత్రాలు అందించలేదని కొర్రీలు పెట్టి ఉద్యోగానికి దూరంచేశారని వాపోయారు. ఈ విషయంలో పూర్తిస్థాయిలో ఉన్నతాధికారులు విచారణ జరపాలని, నియామక పత్రాలు అందించిన వారి ఒరిజినల్ సర్టిఫికెట్లు పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అయితే పలువురు ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వారికి ఉద్యోగం రాకపోవడంతో తమకు సరైన న్యాయం జరగకపోతే ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసి సమగ్ర విచారణ జరిపే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు.

మెరిట్ లిస్ట్‌కు ముందే నియామక పత్రాలు

సాధారణంగా ఔట్‌సోర్సింగ్ (తరువాయి 8వ పేజీలో..)

నాళేశ్వర్ గ్రంథాలయాన్ని సందర్శించిన చైర్మన్


జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడిని సన్మానిస్తున్న దృశ్యం

నవీపేట,ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాళేశ్వర్‌లోని గ్రామీణ గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంతిరెడ్డి రాజిరెడ్డి సందర్శించారు. స్థానిక గ్రామీణ గ్రంథాలయంలో ఫర్నీచర్, ఇతర సౌకర్యాలను స్థానికులు ఏర్పాటు చేసుకోవడం పట్ల వారిని అభినందించారు. గ్రంథాలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ చైర్మన్, పలువురు నాయకులను స్థానికులు శాలువా, మెమెంటోలతో సన్మానించారు. అనంతరం నాళేశ్వర్, తుంగిని, నిజాంపూర్, లింగాపూర్, సిరన్‌పల్లిలో జై బాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమంలో భాగంగా పాదయాత్రలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్, రాజేందర్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


ఇన్‌చార్జి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపడుతున్న దృశ్యం

బోధన్‌రూరల్,ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆదేశానుసారం తాను రైతులకు అందుబాటులో ఉండి అవసరమైన సేవలు ఎప్పటికప్పుడు అందిస్తానని బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఇన్‌చార్జి చైర్మన్ చీల శంకర్ అన్నారు. బుధవారం బోధన్ ఏఎంసీ ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వం వైస్ చైర్మన్‌గా ఉన్న చీల శంకర్‌కు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన అంకు సంధ్యదాము ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం రావడంతో ఆమె చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. అనంతరం బోధన్ ఎమ్మెల్యే ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలను అప్పగించారు. బుధవారం బోధన్ ఏఎంసీ చైర్మన్‌గా చీల శంకర్ బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సేవలు చేయడానికి అవకాశం కల్పించిన మాజీమంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన ఆదేశాల ప్రకారం ఎప్పుడు రైతులకు అండగా ఉంటూ సమస్యలను పరిష్కారిస్తూ వారి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈకార్యక్రమంలో డీసీసీ డెలిగేట్ గంగాశంకర్, మండల అధ్యక్షులు నాగేశ్వర్‌రావు, మందర్నా రవి, వై.నరేందర్‌రెడ్డి, పోతారెడ్డి, పాషామొయినోద్దీన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

● మార్కెట్ కమిటీలో రైతులకు అన్నవితరణ

బోధన్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో రైతులకు ప్రతిరోజు అన్నదానం అందించేందుకు కార్యక్రమాన్ని ప్రారంభించారు. బుధవారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఇన్‌చార్జి చైర్మన్ చీల శంకర్ వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకుని మార్కెట్ కమిటీకి వరి ధాన్యాన్ని తరలించేందుకు రైతులు వస్తుంటారని వారికి ఇబ్బందులు కలగకుండా ఉచిత అన్నదాన ఆర్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ డెలిగేట్ గంగాశంకర్, మండల అధ్యక్షులు నాగేశ్వర్, నరేందర్ రెడ్డి, పోతారెడ్డి, గణపతిరెడ్డి, పాల్గొన్నారు.

తాగిన మత్తులో వ్యక్తి హల్‌చల్

నవీపేట,ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): నవీపేట ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం రాత్రి ఓ వ్యక్తి మద్యం సేవించి న్యూసెన్స్ చేశారు. ఆసుపత్రి సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం నవీపేటకు చెందిన వ్యక్తి తన కుమారుడికి చర్మ సంబంధమైన ఎలర్జీ ఉందని, అతనికి చికిత్స అందించాలని రాత్రి సమయంలో ఆసుపత్రికి వచ్చాడు. మద్యం మత్తులో ఉన్న అతడు ఆసుపత్రి సిబ్బందిని దుర్భాషలాడుతూ న్యూసెన్స్ చేశాడు. దీంతో వారు స్థానిక పోలీసులకు సమాచారం అందించడంతో ఆసుపత్రికి పోలీసు సిబ్బంది చేరుకున్నారు. అనంతరం మద్యం సేవించి న్యూసెన్స్ చేస్తున్న వ్యక్తిని పోలీసులు గట్టిగా మందలించి బయటకు పంపించారు. రోగులకు సేవలందించే వైద్య సిబ్బందిని మద్యం మత్తులో ఇకపై ఎవరైనా అకారణంగా దూషించిన, విధులకు ఆటంకం కలిగించినా సదరు వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిబ్బంది కోరుతున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

వర్ని,ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): వర్ని మండల కేంద్రంలోని మ్యాట్రిక్స్ పాఠశాలలో బుధవారం సైబర్ నేరాలపై సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్ ఏసీపీ వెంకటేశ్వర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ అరెస్ట్, ఆన్‌లైన్ బెట్టింగ్, ఐపీఎల్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యాక్రమంలో వర్ని ఎస్‌ఐ మహేష్, సిబ్బంది గౌతం, అక్బర్, సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రతి ఒక్కరూ భక్తిభావం అలవర్చుకోవాలి'

నవీపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని అఖిల భారత హనుమాన్ సేవాసమితి విజయవాడ పీఠాధిపతి శ్రీ దుర్గాప్రసాద్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని శ్రీ రామాలయంలో హనుమాన్ మాలధారులను ఉద్దేశించి మాట్లాడారు. హనుమాన్ మాలధారులు నిష్టతో దీక్షను కొనసాగించినట్లయితే వారికి దైవానుగ్రహం తప్పక కలుగుతుందని అన్నారు. సేవ, దయ, జాలి గుణాన్ని ప్రతి ఒక్కరు అలవర్చుకోవాలని ఆయన సూచించారు. పీఠాధిపతి శ్రీ దుర్గాప్రసాద్‌ను హనుమాన్ మాలధారులు సన్మానించారు.

జాడిజమాల్‌పూర్ వృద్ధాశ్రమం సందర్శన

బోధన్‌రూరల్,ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): మండలంలోని జాడిజమాల్‌పూర్ గ్రామంలో గల వృద్ధాశ్రమాన్ని బుధవారం పద్మసింగ్, రమణ, సుజాత జిల్లా అధికారుల ఆదేశానుసారం సందర్శించారు. వృద్ధాశ్రమంలో మొత్తం 16మంది వృద్ధులు ఉన్నారని, ఒకరు మానసిక వికలాంగుడు అని పేర్కొన్నారు. వృద్ధాశ్రమంలో ఉన్న వారిని కొడుకులు, కోడళ్లు చూడక ఇక్కడ ఉన్నట్లు తెలిపారు.

ఈఎంటీ దినోత్సవ వేడుకలు

బోధన్‌రూరల్,ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): ఈఎం ఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీస్ సంస్థలో పని చేస్తున్న 108సిబ్బంది బుధవారం ఈఎంటీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా ఏప్రిల్ 2వ తేదిన 108సర్వీస్‌లో పని చేస్తున్న ఏమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్స్ సేవలకు గుర్తింపుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని పీఎం వసంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈఎంటీ అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు.

గొల్లపల్లిలో నందీశ్వర విగ్రహం కోసం భూమిపూజ

రామారెడ్డి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి గ్రామ ప్రధాన రోడ్డు పై బుధవారం వీడీసీ ఆధ్వర్యంలో గొల్లపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద కామారెడ్డి - రామారెడ్డి వెళ్లే నందీశ్వర విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి భూమిపూజ నిర్వహించారు. గొల్లపల్లి గ్రామానికి చెందిన వీడీసీ, రాజకీయ నాయకులు, యువకులు భూమిపూజ నిర్వహించారు.

ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తాం

● తహసీల్దార్ శ్రావణ్ కుమార్


రెంజల్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్

రెంజల్,ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామని తహసీల్దార్ శ్రావణ్ కుమార్ అన్నారు. బుధవారం రెంజల్ మండల కేంద్రంలో సొసైటీ ఆధ్వర్యంలో రెంజల్, సాటాపూర్, తాడ్‌బిలోలి గ్రామాలలో కొనుగోలు కేంద్రాలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మొబిన్ ఖాన్, సొసైటీ చైర్మన్ మొయినోద్దీన్‌తో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి రైతు పండించిన ధాన్యాన్ని తప్పకుండా కొనుగోలు చేస్తుందని, కొనుగోలు కేంద్రాల ద్వారానే ధాన్యాన్ని విక్రయించాలని, ఏ గ్రేడ్ ధాన్యానికి 2320రూపాయలు, బీ గ్రేడ్ ధాన్యానికి 2300రూపాయలు చెల్లించడం జరుగుతుందన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు.

● రైతులు దళారులను ఆశ్రయించవద్దు

రైతులు తాము పండించిన పంటను దళారుల పాలు చేయకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ ఏపీఎం చిన్నయ్య అన్నారు. బుధవారం సాటాపూర్, బోర్గాం, అంబేద్కర్ నగర్ గ్రామాలలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ శ్రావణ్ కుమార్, మండల అధ్యక్షుడు మొబిన్ ఖాన్‌తో కలిసి ప్రారంభించారు. రైతులు అధిక లాభాలు ఆర్జించాలంటే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారానే సాధ్యమవుతుందని, తాము పండించిన పంటలను దళారుల పాలు చేయకుండా కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్, నాయకులు సాయిరెడ్డి, జావీదోద్దీన్, సాయిబాబా గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుర్మె శ్రీను, డైరెక్టర్ అగ్గు నారాయణ, సాయిరెడ్డి, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు కార్తీక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు గైని కిరణ్, శివ, యోగేష్, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని కోస్లీ పంచాయతీ పరిధిలోని ఫకీరాబాద్‌లో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఉషారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్వింటాలు ఏ గ్రేడ్ ధాన్యానికి 2320రూపాయలు, బీ గ్రేడ్ ధాన్యానికి 2300రూపాయలు చెల్లించడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. మండలంలోని వివిధ గ్రామాలలో 22 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం భూమేష్ గౌడ్, వీవోఏలు రమాతార, లత, అర్చన, ఏఈవో వినోద్, వీడీసీ సభ్యులు శ్రీధర్ బాబు, గంగాధర్ ఉన్నారు.

● నేడు నవీపేట, నాగేపూర్‌లలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

మండలంలోని నవీపేట, నాగేపూర్‌లలో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరుగుతుందని నవీపేట సొసైటీ చైర్మన్ అబ్బన్న, నాగేపూర్ సొసైటీ చైర్మన్ శైలేష్ కుమార్‌లు వేర్వేరు ప్రకటనలలో తెలిపారు. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని వారు కోరారు.

కోటగిరి: పొతంగల్ మండలంలోని కొడిచర్ల గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాన్ని కోటగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను కేటాయించిందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి గిట్టుబాటు ధరను పొందాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం బస్వంత్, గ్రామ సంఘం అధ్యక్షురాలు పోశవ్వ, కార్యదర్శి బాలమణి, సీసీలు రమా, విఠల్, సాయిబాబా, రమేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ:మండలంలోని కొండూర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్నిఏపీఎం కిరణ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవి బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో గోగు సురేష్‌రెడ్డి, ప్రవీణ్ రెడ్డి,రాంరెడ్డి, సదానందం, ఎన్.భాస్కర్, క్యాషపురం భాస్కర్, మాజీ ఉపసర్పంచ్ మహిపాల్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సత్యరాజ్, సభ్యులు పాల్గొన్నారు.

పీసరగుట్ట తండాలో

సిరికొండ మండలం కొండూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని పీసరగుట్ట తండాలో దాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంబించాలని డీఆర్‌డీవో పీడీని ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి ఆదేశించారు.పీసరగుట్ట తండాకు చెందిన గిరిజనులు బుదవారం ఎమ్మెల్యే భూపతిరెడ్డిని కలిసి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే వెంటనే డీఆర్‌డీవో పీడీకి పోన్ చేసి తండాలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి దాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. ఐకెపి అద్వార్యాంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంబిస్తున్నట్లు ఎమ్మెల్యే చెప్పడంతో తండాకు చెందిన గిరిజనులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేను హొన్నాజీపేట్ మాజి సర్పంచ్ బేల్దారి కృష్ణ అద్వార్యాంలో తిరుపతినాయక్,ఇతర తండాకు చెందిన పెద్దలు కలిషారు.

మోపాల్:గ్రామాల్లోఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మోపాల్ సొసైటీ చైర్మన్ గంగారెడ్డి అన్నా రు. బుధవారం మోపాల్ మండల కేంద్రంలో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చే సిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటను మధ్య దళారులకు అమ్ముకొని మోసపోకుండా ఉండేందుకు ప్రభుత్వం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.ఈకార్యక్రమంలో సొసైటీ పాలకవర్గం సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సిరికొండ: అరుగాలం కష్టించి పండించన దాన్యాన్ని దళారులకు అమ్ముకోవద్దని సిరికొండ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అద్యక్షులు చెల్లెం గంగాధర్ రైతులకు విజ్ఞప్తి చేశారు. పీఏసీఎస్ పరిదిలోని చిన్నావాల్గోట్,అన్నాపూర్ణేశ్వరీ కాలనీ లో కొనుగోలు కేంద్రాలను అద్యక్షులు చెల్లెం గంగాధర్ బుదవారం ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో వరి దాన్యాన్ని అమ్ముకుంటే గిట్టుబాటు ధర లభిస్తుందని అన్నారు.రైతులకు ఎలాంటి మోసం కూడ జరుగదన్నారు. సన్నరకం దాన్యాన్ని ప్రభుత్వానికి అమ్ముకుంటే క్వింటల్ దాన్యానికి రూ. ఐదు వందల బోనస్ చెల్లిస్తుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ అద్యక్షులు మైలారం గంగారెడ్డి,మాజీ సర్పంచ్ బాడాల మహిపాల్‌రైతులు సాయరెడ్డి, దడివే గణేష్, మోహన్‌రెడ్డి పంచాయతీ కార్యదర్శి శరణ్య పలువురురైతులు, పీఏసీఎస్ కార్యదర్శి గిరిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి: ఎడపల్లి మండల కేంద్రంతోపాటు మండలంలోని దుబ్బాతాండ, మంగళ్‌పాడ్, వడ్డాపల్లి, బ్రాహ్మణ్‌పల్లి గ్రామాలలో బుధవారం ఐకేపి ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏపిఎం గంగారాం, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మన్నె శ్రీదేవి, ఆయా గ్రామాల సమాఖ్య అధ్యక్షులు ప్రారంభించారు.రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందాలని సూచించారు. ఈకార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య సభ్యులు, సీసీలురైతులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: మహిళ సాధికారితే ధ్యేయంగా మహిళలు అన్ని రంగాలలో రాణించాలనే ఉద్దేశంతో వరి కొనుగోలు కేంద్రాలను మహిళ సంఘాలకు ప్రభుత్వం అప్పగిస్తుందని టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, మండల అధ్యక్షుడు నాగేశ్వర్ రావు అన్నారు. బుధవారం బోధన్ మండలంలోని పెంటాఖుర్దు గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అన్ని రంగాలలో రాణించాలన్నారు. మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక రకాలుగా కృషి చేస్తుందన్నారు. రైతులు తమ ధాన్యాన్ని వరి కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని, దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ అధికారులు, సిబ్బంది, గ్రామ సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

'అసత్య ప్రచారాలు మానుకోవాలి'


పాదయాత్ర చేస్తున్న డీసీసీబీ చైర్మెన్ రమేష్


ఏర్గట్లలో పాదయాత్ర చేస్తున్న నాయకులు

నందిపేట, ఏప్రిల్ 02 (ఆంధ్రజ్యోతి): మహనీయుల గురించి అసత్య ప్రచారాలను మానుకోవాలని బీజేపీ నాయకులకు డీసీసీబీ చైర్మెన్ కుంట రమేష్ రెడ్డి హితవు పలికారు. బుధవారం నందిపేట మండలంలోని సిద్దాపూర్, వన్నెల్(కే) గ్రామాలలో జై బాపు, జై బీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ జెండాలను ఎగురవేశారు. ప్రధాన కూడళ్లలో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మెన్ కుంట రమేష్ రెడ్డి మాట్లాడుతూ మహనీయుల గురించి అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను పక్కదొవ పట్టిస్తున్న పార్టీలకు బుద్ధి చెప్పి, ప్రజలకు మహత్మాగాంధీ అంబేద్కర్‌ల గురించి వివరించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించే విధంగా పని చేయాలని డీసీసీబీ చైర్మెన్ కుంట రమేష్ రెడ్డి సూచించారు. కార్యక్రమంలో నిజామాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెంట ఇంద్రుడు, మండల పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్, ఐలాపూర్, చింరాజ్‌పల్లి పీఏసీఎస్‌ల చైర్మెన్‌లు మీసాల సుదర్శన్, బొంకం గంగారెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ లోక హన్మాండు ఉన్నారు.

నంది పేట (డొంకేశ్వర్): డొంకేశ్వర్ మండలంలోని నికాల్‌పూర్, కోమట్‌పల్లి గ్రామాల్లో బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పాదయాత్రలు చేశారు. అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు మహత్మా గాంధీ, అంబేద్కర్ ఫొటోలతో జై బాపు, జై బీమ్, జై సంవిధాన్ నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు భూమేష్, సీనియర్ నాయకులు దేగాం గంగారెడ్డి, మోర్తాడ్ భోజారెడ్డి, బీం నాయక్ తదితరులు ఉన్నారు.

ఏర్గట్ల : అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ఆదేశాల మేరకు జైబాపు జైభీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం కాంగ్రెస్ నాయకులు పాదయాత్ర చేశారు. మండలంలోని తాళ్ళరాంపూర్, గుమ్మిర్యాల్, దోంచంద గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మహనీ [illegible] అవమానిస్తోందని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికి రాహుల్ గాంధీ జైబాపు జైభీమ్ జై సంవిధాన్ నినాదానికి పిలుపు నిచ్చారన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, మండల పార్టీ అధ్యక్షుడు సోమ దేవరెడ్డి, బాల్కొండ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆడెం గంగాప్రసాద్, బద్దం లింగారెడ్డి, ముస్కు మోహన్, పన్నాల నర్సారెడ్డి, గడ్డం జీవన్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వేల్పూర్ : మండలంలోని పలు గ్రామాలలో బుధవారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జైబాపు, జైబీమ్, జైసంవిదాన్ కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. ఉదయం దొన్కంట్, దర్మోరా, శెట్‌పల్లి గ్రామాలలో కాంగ్రెస్ నాయకులు పాదయాత్రలు చేసి ఇందిరాగాంధీ , అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలల వేశారు. కార్యక్రమానికి మండల ఇంచార్జి వెల్మ భాస్కర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమాలలో వెల్మ రంజిత్, అడ్వాల మనోజ్, ఆనంద్, సంజీవ రెడ్డి, రొక్కం మురళి, వెంకటేష్, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

మోర్తాడ్ : మండలంలోని వెంకటాపూర్, కొమన్‌పల్లి, కుకునూర్, అంక్సపూర్, పోచంపల్లి, పడిగెల గ్రామాలలో బుధవారం జైబాపు, జైబీమ్, జైసంవిదాన్ పాదయాత్రను కాంగ్రెస్ నాయకులు చేపట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్ : ప్రతీ ఒక్కరు మహాత్మగాంధీని స్మరించుకుంటు అహింస శాంతి సిద్ధాంతాలను అలవర్చుకోవాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి వినయ్‌కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని 11, 12, 30 వార్డులలో జైబాపు, జైబీమ్, జైసంవిదాన్ కార్యక్రమాన్ని ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన రాజ్యాంగాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ సాయిరెడ్డి, మార్కెట్ యాడ్ చైర్మన్ సాయిబాబా గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ లింగాగౌడ్, కాంగ్రెస్ నాయకులు అయ్యప్ప శ్రీనివాస్, పండిత్ పవన్, దొండి రమణ, జిమ్మి రవి, కొంతం మురళి పాల్గొన్నారు.

హత్యకేసులో నిందితుడి అరెస్ట్

వేల్పూర్ , ఏప్రిల్02(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం పచ్చల నడ్కుడ గ్రామంలో శంకర్ అనే వ్యక్తి హత్య కేసులో నిందితుడిని బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మార్చి 22వ తేదీన నిందితుడు హత్యకు గురైన శంకర్ వీరిద్దరు పచ్చల నడ్కుడ గ్రామంలోని రంజాన్ బీ ఇంటిలో నివాసం ఉంటున్నారు. మార్చి 22న వీరిద్దరు రాత్రి సమయంలో మద్యం సేవించి గొడవ పడ్డారన్నారు. నిందుతుడు బాలాజీ ఇంతకు ముందు మహారాష్ట్రలోని కొండలవాడి పోలీస్ స్టేషన్‌లో హత్యా నేరం ఉందన్నారు. నిందితుడు బాలాజీ భార్యతో శంకర్ వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని ఆరోపిస్తూ బాలాజీ శంకర్‌తో గొడవ పడ్డాడన్నారు. శంకర్‌ని కర్రతో కొట్టి, చేతులతో చాతి, తొడల బాగాలలో కొట్టడం వల్ల శంకర ఆ రోజు రాత్రి స్పృహ తప్పి పడిపోయాడన్నారు. మరుసటి రోజు తెల్లవారుజామున బాలాజీ నిద్ర లేచి చూడగా శంకర్ ఎంత పిలిచినా లేవకపోవడంతో అతను చనిపోయాడని భావించి ఎప్పటి లాగనే మృతుడిని అదే గదిలో ఉంచి బయట నుంచి తలుపులు పెట్టి గడియ పెట్టి వెళ్లిపోయాడన్నారు. నిందితుడు బాలాజీ కోసం గాలిస్తుండగా బుధవారం రోజు వేల్పూర్‌కు వచ్చి పచ్చల నడ్కుడకు వెళ్ళె రోడ్డులో ఉన్నాడని, పక్కా సమాచారంతో పోలీసులు వెళ్ళి బాలాజీని అదుపులోకి తీసుకొని రిమాండ్ నిమిత్తం కోర్టుకు పంపించామని రూరల్ సీఐ తెలిపారు.

గ్రంథాలయానికి ఫ్రిడ్జ్ అందజేత

కామారెడ్డిటౌన్,ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి):కామారెడ్డి గ్రంథాలయ సంస్థ పరిధిలోని బిక్కనూరు, దోమకొండ శాఖ గ్రంథాలయాలకు బిక్కనూరుకు చెందిన లాయర్ రాజాగౌడ్ వాటర్ కూలింగ్ ఫ్రిడ్జ్‌ను అందించారని బుధవారం గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దిచంద్రకాంత్‌రెడ్డి అన్నారు. పాఠకులు, నిరుద్యోగుల సౌకర్యార్థం ఏర్పాటు చేయడం అభినందించదగిన విషయమన్నారు. కార్యక్రమంలో సిబ్బంది మౌనిక, కపిల్ పాల్గొన్నారు.

'పాపన్న గౌడ్ విగ్రహాన్ని నెలకొల్పాలి'

కోటగిరి,ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): సర్వాయి సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలని గీత పనివారాల సంఘం రాష్ట్ర కార్యదర్శి విఠల్ గౌడ్ డిమాండ్ చేశారు. కోటగిరి మండల కేంద్రంలోని గీత పరిశ్రమ సహకార సంఘం ఆధ్వర్యంలో పాపన్న గౌడ్ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజనులను ఏకం చేసి రాజ్యాధికారం కోసం పోరాడితే సాధించలేనిది ఏది లేదని చెప్పిన మహనీయుడు పాపన్న గౌడ్ అని కొనియాడారు. పాపన్న గౌడ్ విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై నెలకొల్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు గంగాప్రసాద్, ప్రకాష్, కృష్ణ, శ్రీనివాస్, సాయికృష్ణ, ప్రశాంత్ పాల్గొన్నారు.

బాసరలో ఆత్మహత్యాయత్నం.. కాపాడిన పోలీసులు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బోయిగల్లికి చెందిన గంగాప్రసాద్ కుటుంబ కలహాలతో తన ఇద్దరు పిల్లలతో కలిసి బాసర గోదావరిలో ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించగా అక్కడి పోలీసులు అడ్డుకున్నారు. బుధవారం మధ్యాహ్నం గంగాప్రసాద్ తన బైక్‌పై ఇద్దరు పిల్లలతో కలిసి బాసర గోదావరి బ్రిడ్జిపై ఆగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నిస్తుండగా అక్కడే డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ మోహన్‌సింగ్ అతన్ని అడ్డుకున్నాడు. గంగాప్రసాద్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ నిర్వహించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. డ్యూటీలో ఉండి ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకున్న కానిస్టేబుల్ మోహన్‌సింగ్‌ను పలువురు అభినందించారు.

సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు

ఏర్గట్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని రేషన్ షాప్‌ల వద్ద బుధవారం కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో రేషన్ లబ్ధిదారులకు సన్నబియ్యం అందిస్తుండటంతో హర్షం వ్యక్తం చేస్తూ రేషన్ లబ్ధిదారులు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల పార్టీయని ఇచ్చిన మాట ప్రకారం రేషన్ లబ్ధిదారులకు సన్నబియ్యం ఇస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, రేండ్ల రాజారెడ్డి, గడ్డం జీవన్, బద్ధం లింగారెడ్డి, ముస్కు మోహన్, పన్నాల నర్సారెడ్డి, ఓర్సు రాములు, మునిమాణిక్యం అజయ్, దండెవోయిన సాయికుమార్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

'అవినీతిపై విచారణ జరిపించాలి'


సహకార సంఘం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

కోటగిరి,ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): బోగస్ రైతుల ముసుగులో బోనస్ డబ్బులను స్వాహా చేసిన ఘటనపై విజిలెన్స్ అధికారులతో విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. కోటగిరి మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయం ఎదుట బుధవారం సీపీఐ నాయకులు, రైతులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జి దుబాస్ రాములు మాట్లాడుతూ సొసైటీకి గత ఖరీఫ్‌లో వరి ధాన్యం అమ్మిన రైతుల జాబితాను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. బోగస్ రైతుల పేరుతో బోనస్ డబ్బులు సుమారు 50లక్షల రూపాయలు స్వాహా చేసినట్లు ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు విఠల్ గౌడ్, గంగాధర్, రాములు, ఆనంద్, మాజీ ఎంపీటీసీ సలీం, కూచి సాయిబాబా, నజీర్, నర్సయ్య, శివరాజు, హన్మాండ్లు, సోహెల్, వాజీద్, సాయిలు తదితరులున్నారు.

నగరంలో కత్తిపోట్లు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి):నగరంలోని ఆరవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం సాయంత్రం కత్తిపోట్ల కలకలం రేగింది. బోధన్ రోడ్‌లోని నిజాంసాగర్ కెనాల్‌కట్ట ప్రాంతంలో షేక్ గౌస్ అనే వ్యక్తిపై ముగ్గురు యువకులు కత్తులతో దాడి చేశారు. పాత కక్షల నేపథ్యంలో ముగ్గురు యువకులు షేక్ గౌస్‌పై కత్తితో దాడి చేయగా మూడు చోట్ల కత్తిపోట్లు దిగాయి. ఈ ఘటనలో షేక్ గౌస్ కడుపులోంచి పేగులు బయటకు వచ్చాయి. హుటాహుటీన గౌస్‌ను జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. కూలీ పని చేసే చోట యువకుల మధ్య తలెత్తిన విబేదాలు కత్తిపోట్లకు దారితీసి నట్లు తెలుస్తుంది. ఈ మేరకు 6వ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రంజాన్ రోజు నగరంలో కత్తులతో యువకులు హల్ చల్ చేసిన ఘటన మరువకముందే నగరంలో కత్తిపోటు జరగడం కలకలం రేపింది.

హోటళ్లను తనిఖీ చేసిన మున్సిపల్ అధికారులు

ఆర్మూర్ టౌన్ , ఏప్రిల్ 02 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పలు హోటళ్ళను మున్సిపల్ అధికారులు తనిఖీ చేశారు. మున్సిపల్ పరిధిలో హోటళ్ళతో పాటు రెస్టారెంట్, బేకరీలలో పరిశుభ్రత పాటించాలని యజమానులకు సూచించారు. అలాగే ప్లాస్టిక్‌ను తనిఖీ చేపట్టి పలు షాపులకు జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సానిటరి ఇన్‌స్పెక్టర్ గజానంద్, పర్యవరణ ఇంజనీర్ పూర్ణమౌలి, సిబ్బంది అర్జున్ , రమేష్, రవి, సంతోష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల అదుపు

● ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి

నందిపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గ్రామాలు, మండలాలు, మున్సిపాలిటీలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే నేరాలను అదుపు చేసుకోవచ్చని ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. బుధవారం నందిపేట మండలం లక్కంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమన్నారు. ఈ నిజాన్ని గుర్తించి సీసీ కెమెరాలను బాధ్యతగా తీసుకొని ప్రతీ గ్రామ, మండల కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని ఏసీపీ కోరారు. దుకాణాదారులు, ఆలయ కమిటీలు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వీటి ఏర్పాటుతో దొంగతనాలు జరుగవని, రోడ్డు ప్రమాదాలు జరిగితే నిందితులను గుర్తు పట్టవచ్చని ఏసీపీ తెలిపారు. దీని వలన నేరాలు అదుపులోకి వస్తాయని, సీసీ కెమెరాలను ఏర్పాటు ప్రతీ ఒక్కరు సహకరించాలని ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి కోరారు. లక్కంపల్లి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన ప్రతీ ఒక్కరికి ఏసీపీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కమ్మరి చిన్నయ్య, రాజశేఖర్, సురేష్, వీడీసీ సభ్యులు తధితరులు ఉన్నారు.

పనిముట్లను ప్రారంభించిన విశ్వబ్రాహ్మణులు

వేల్పూర్, ఏప్రిల్02(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండల కేంద్రంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పని ముట్లను ప్రారంబించారు. ఉగాది రోజు పని మూట్లను పక్కకు పెట్టిన విశ్వబ్రాహ్మణులు బుధవారం తిరిగి పనిమూట్లను ప్రారంభించడం జరిగిందని విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు శ్రీధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యవర్గ సభ్యులు, విశ్వబ్రాహ్మణులు పాల్గొన్నారు.

అంకాపూర్‌లో సన్నబియ్యం పంపిణీ

ఆర్మూర్ రూరల్ , ఏప్రిల్01(ఆంధ్రజ్యోతి): అంకాపూర్‌లో బుధవారం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి అమలు పరుస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మార చంద్రమోహన్, ఆర్ఐ దశరత్, ఏఎంసీ డైరెక్టర్ అమృత్‌రావు, పంచాయితీ కార్యదర్శి హారిక తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ టౌన్ : పట్టణంలోని హుస్నాబాద్ కాలనీ 35వ వార్డులో గల రేషన్ షాపులో మాజీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ సడక్ వినోద్ సన్నబియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బడుగు బలహీన వర్గాల కోసం నిరంతరం పనిచేస్తున్నాడని ప్రజల అవసరాలను తెలుసుకొని సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారని ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కలిగోట శ్రీనివాస్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

'ఉద్యోగాలు కల్పించాలి'

కామారెడ్డిటౌన్,ఏప్రిల్ 02(ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక సారధిలో ఉద్యోగాలు కల్పించాలని జిల్లా ఉద్యమ నిరుద్యోగుల కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సాయిలు యాదవ్ అన్నారు. బుధవారం జిల్లా కార్యాల యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కోసం జిల్లా కళాకారులు గల్లీనుంచి ఢిల్లీదాకా ఆటపాటలతో ఉద్యమాన్ని ఉద్రూతలుగించామన్నారు. ప్రత్యేక తెలంగాణ కోసం పోరాడితే గత ప్రభుత్వం కేవలం 550 మందికిఉద్యోగాలు ఇచ్చి చేతులు దులుపుకుందని, ఇప్పుడున్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడగానే ఉద్యోగాలు ఇస్తామని చెప్పి సంవత్సరం గడిచినా ఉద్యోగాలు ఇవ్వడం లేదని అన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌యాదవ్, రాజలింగం, ఎల్లయ్య, దేవరా జీరెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ రాయితీ సదుపాయం గడువు పెంపు

● ఈ నెల 30 వరకు చెల్లింపునకు అవకాశం
● సద్వినియోగం చేసుకోవాలని కోరిన కలెక్టర్

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అనధికార లే అవుట్ల క్రమబద్ధీకరణ, ప్లాట్ల రెగ్యూలరైజేషన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఎల్ఆర్ఎస్ 25 శాతం రాయితీ సదుపాయాన్ని పొడిగించిందని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. మార్చి 31తో గడువు ముగియగా ప్రజల నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకు ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ గడువును ఈ నెల 30 వరకు పొడిగించిందన్నారు. జిల్లాలోని అర్హులైన వారందరూ ఈ వెసులుబాటును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియను సులభతరం చేసేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఎఫ్‌టీఎల్ నిషేధించిన సర్వే నెంబర్ మినహా ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న అందరికి రెగ్యూలరైజేషన్ రుసుము నిర్ణయించడం జరిగిందని రుసుము ఎంత అనేది ఎవరైనా తమ సెల్‌ఫోన్ నెంబర్ ద్వారా లాగిన్ అయ్యి పరిశీలించుకోవచ్చన్నారు. ఫీజు చెల్లించేందుకు అర్హత ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు ఏప్రిల్ 30లోగా నిర్ణీత రుసుము చెల్లిస్తే 25 శాతం రిబెట్ వర్తిస్తుందని తెలిపారు. ఇప్పటికే జిల్లాలో అనేక మంది తమ ప్లాట్లను, అనధికార లే అవుట్లను రాయితీతో కూడిన రుసుము చెల్లించి రెగ్యూలరైజ్ చేసుకున్నారని ఆయన తెలిపారు. వివిధ కారణాల వల్ల రెగ్యూలరైజేషన్ చేసుకోలేకపోయిన వారి కోసం మరో అవకాశం కల్పిస్తూ రాయితీ సదుపాయం గడువును ఈనెలా ఖరువరకు పొడగించిందన్నారు. అనధికార లేఅవుట్‌లు చేసి అందులో పది శాతం ప్లాట్లను విక్రయించిన వారికి మిగతా ప్లాట్లను క్రమబద్ధీకరించుకునే వెసులుబాటు ఉందని ఆయన సూచించారు. క్రమబద్ధీకరించని భూముల్లో ఎటువంటి రిజిస్ట్రేషన్‌లకు, నిర్మాణాలకు అనుమతి మంజూరు చేయడం జరగదని దీనిని దృష్టిలో పెట్టుకొని అర్హులైన వారందరూ ఈనెల 30లోపు క్రమబద్ధీకరణ చేసుకోవాలని తెలిపారు.

సంతోషిసాయిబాబా ఆలయ పునఃప్రతిష్ఠాపన పూజలు ప్రారంభం

నిజామాబాద్ కల్చరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నాందేవ్‌వాడలో గల శ్రీసంతోషిసాయిబాబా ఆలయ పునఃప్రతిష్ఠాపన పూజలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దేవాదాయ, ధర్మాదాయ శాఖ పరిధిలోని ఆలయ అర్చకులు, అధికారుల సమక్షంలో గణపతి, గౌరీ, విశ్వక్‌సేన, పుణ్యాహవచనం, ఆవాహిత దేవత పూజలు, యాగశాల ప్రవేశం, హోమం కార్యక్రమాలు నిర్వహించారు. పండితులు వేలేటి పశుపతిశర్మ, రామశర్మ, సముద్రాల శ్రీధరాచార్య, ఉమామహేశ్వర శర్మ, గోవర్ధన కృష్ణమాచార్యులు, కలకుంట్ల శ్రీధరా చార్య వేదమంత్రాలు పఠించగా ఆలయ అర్చకులు శ్రీభాష్యం కృష్ణమాచార్య పూజాదికార్యక్రమాలు నిర్వహించారు.


మట్టితో నిర్మాణం చేసిన చేప పిల్లల నర్సరీ ఇదీ


శిథిలావస్థకు చేరిన సిమెంట్ నర్సరీలు ఇవే


శిథిలావస్థకు చేరిన చేప పిల్ల ఉత్పత్తి కార్యాలయం

చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం పునర్నిర్మాణమయ్యేనా..!?

● రూ.4 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు ● నిధుల మంజూరుకు గ్రీన్ సిగ్నల్ వచ్చేనా..!? ● అందరి చూపు చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం వైపు

నిజాంసాగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ ప్రాజెక్టుకు అనుసంధానంగా ఉన్న చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం.. చేప పిల్లల ఉత్పత్తి కేంద్రానికి ఆలనా పాలనా లేక ప్రస్తుతం చేప పిల్లలు ఉత్పత్తికి నోచుకోవటం లేదు. కార్యాలయాలు చేప పిల్లల ఉత్పత్తి చేసే నర్సరీలు, మట్టి చెరువులు శిథిలావస్థకు చేరుకుపోయాయి. దీంతో దాదాపు 30 ఏళ్లుగా ఈ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలో ఉత్పత్తికి నోచుకోవటం లేదు. ప్రభుత్వాలు, అధికారులు మారుతూ వస్తున్నప్పటికీ ఈ కేంద్రంపై నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిజాంసాగర్ ప్రాజెక్టుకు అనుసంధానంగా 11 ఎకరాల ప్రభుత్వ భూమిలో 1962 సంవత్సరం చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో లక్ష్యాన్ని మించి చేప పిల్లలను ఉత్పత్తి చేస్తూ ఉండేవారు. ఈ కేంద్రంలో ఉత్పత్తి చేసిన చేప పిల్లలు రాష్ట్ర రాజధానిలోని ఎంతో ప్రాముఖ్యత సంచరించుకునేది కాలక్రమేనా పాలకులు, అధికారులకు చేప పిల్లలు ఉత్పత్తి కేంద్రానికి నిర్లక్ష్యం చేశారు. ఈ కేంద్రంలో ఉన్న 36 సిమెంట్ నర్సరీలు 8 మట్టి చెరువులు నిర్మాణం చేయడంతో పాటు చేదబావిని కూడా ఏర్పాటు చేశారు. నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ఈ కేంద్రానికి నీటి సరఫరా కోసం నిర్మాణ దశలోనే పైపులైన్లను వేశారు. ఇక్కడ అప్పట్లో పని చేసిన అధికారుల నిర్లక్ష్య వైఖరికి పైప్‌లైన్‌లన్నీ ధ్వంసమై పోయాయి. ఉత్పత్తి కేంద్రంలో చేద బావిని కూడా తవ్వించడమే కాకుండా ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్‌ను కూడా నిర్మాణం చేసి చేద బావిలో హై పవర్ విద్యుత్ మోటార్లను బిగించి ఓవర్ హెడ్ వాటర్ నింపి నర్సరీలకు నీటి సరఫరా చేసేవారు అప్పట్లో ప్రాజెక్టు నుండి వచ్చే నీటితో పాటు ఓవర్ ట్యాం కు ద్వారా నీటిని నర్సరీలకు వినియోగించుకొని లక్షల చేప పిల్లలను ఉత్పత్తి చేసేవారు దాదాపు 50 సంవత్సరాలు వరకు ఉత్పత్తి కేంద్రంలో అధికారులు లక్ష్యాన్ని


ఆ కాలంలో తవ్విన ఊట బావి ఇదే

మించి చేప పిల్లలను ఉత్పత్తి చేసేవారు. ఉత్పత్తి చేసిన చేప పిల్లలను ఉభయ జిల్లాలోని బాన్సువాడ, ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజక వర్గాల్లోని చెరువుకుంటలోనే కాకుండా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల పరిధిలో ఉన్న గ్రామపంచాయతీ చెరువుల్లో చేపలను విడుదల చేసేవారు. మత్స్య కార్మికుల ఉద్ధరణ కోసం ప్రభుత్వం అప్పట్లో రాయితీపై అందిస్తూ ఉండే వారు. నిజాంసాగర్ చేప పిల్లలు ఉత్పత్తి కేంద్రం కళా హీనంగా మారింది. ఏ ఒక్క సిమెంట్ నర్సరీలో నీరు నిలువకపోవడంతో చేప పిల్లలు ఉత్పత్తికి నోచుకోవటం లేదు. 80 సంవత్సరాల కింద నిర్మాణం చేసిన ఈ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం ఆవరణలో ఉన్న కార్యాలయాలు కూడా శిథిలావస్థకు చేరుకుపోయాయి. ఉత్పత్తి కేంద్రంలో ఉన్న సిబ్బందిని కూడా నిజామాబాద్, కామారెడ్డి, పోచంపాడు ప్రాంతాలకు బదిలీలు చేశారు. కేవలం ఈ కేంద్రంలో మత్స్య అభివృద్ధి అధికారితో పాటు ఫీల్డ్‌మెన్ ముగ్గురు, స్వీపర్ ఒక్కరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఈ సిబ్బంది విధులు నిర్వహించాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని విధులు నిర్వహిస్తూ ఉంటారు. తెలంగాణ ప్రభుత్వం హయాంలో పదేళ్ల పాటు వంద శాతం రాయితీపై చేప పిల్లలను రిజర్వాయర్లతో పాటు చెరువుకుంటలో కూడా విడుదల చేసింది. నిజామాబాద్, కామారెడ్డి, పోచంపాడు, నిజాంసాగర్ ఉత్పత్తి కేంద్రాల్లో చేప పిల్లలు ఉత్పత్తి జరగకపోవడంతో రాష్ట్ర స్థాయిలోనే ప్రభుత్వం సమైకాంధ్ర నుంచి చేప పిల్లలను విడుదల చేసేందుకు టెండర్ల ద్వారానే చేప పిల్లలను విడుదల చేయుచున్నారు తప్ప ఉత్పత్తి కేంద్రాల మాట పాలకులు అధికారులు మర్చిపోతూనే ఉన్నారని, మత్స్య కార్మికులు ఉత్పత్తి కేంద్రాలను పునర్నిర్మాణం చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం నిజాంసాగర్ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రానికి పునర్నిర్మాణం చేపట్టేందుకు నాలుగు కోట్ల రూపాయల ప్రతిపాదనలు పంపాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంతారావు అధికారులకు సూచించారు. నాలుగు కోట్ల ప్రతిపాదనలు మత్స్యశాఖ కమిషనర్ కార్యాలయంలోనే మగ్గుతున్నాయి. నిజాంసాగర్ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రానికి పూర్వ వైభవం వచ్చేందుకు జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావుపైనే ఉందని మత్స్య కార్మికులు చర్చించుకుంటున్నారు.

అవగాహన లోపం.. లేబర్ కార్డుకు దూరం

● ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్న కార్మికులు ● అవగాహన కల్పిస్తే మరింత మందికి ప్రయోజనం

కోటగిరి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కార్మికులకు తమ హక్కుల గురించి అవగాహన లేకపోవడంతో లేబర్ కార్డులకు దూరమవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా కనబడుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలులోకి తీసుకువస్తుండడంతో ఇప్పుడిప్పుడే కార్డులు పొందేందుకు కార్మికులు ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వం తరఫున అవగాహన కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం చూపుతుండడంతో కార్మికులు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. గ్రామీణ ప్రాంతాలు, చిన్న చిన్న పట్టణాల్లో కార్మికులు లేబర్ కార్డుల గురించి అవగాహన పొందడం చాలా కష్టంగా ఉంటుంది. ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

● ఉమ్మడి జిల్లాలో సుమారు లక్షకు పైగా కార్డులు

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సుమారు 20లక్షలకు పైగా జనాభా ఉండగా ఇందులో 70శాతం మంది వివిధ రంగాలలో కార్మికులుగా పని చేస్తున్నారు. ఇప్పటి వరకు కేవలం లక్ష మందికి మాత్రమే లేబర్ కార్డులు ఉండడం గమనార్హం. ఈ గణాంకాలు చూస్తే కేవలం పదిశాతం లోపు మాత్రమే కార్మికులు కార్డులు పొందినట్లు తెలుస్తుంది.

● లేబర్ కార్డు పొందితే ప్రయోజనాలు


లేబర్ కార్డు ఉన్న వ్యక్తి కూతుళ్ల పెళ్లికి రూ.30వేలు, ప్రసవానికి 30వేలు(ఇద్దరు కూతుళ్లకు మాత్రమే), ఒక సంవత్సరం ముందు బోర్డునందు కార్మికుడు/ కార్మికురాలిగా నమోదైన వారికి మాత్రమ ఇది వర్తిస్తుంది.

● ప్రమాదం వల్ల చనిపోతే బాధిత కుటుంబానికి రూ. 6.30లక్షలు, సాధారణ మరణానికి లక్ష 30 వేల ఆర్థిక సహాయం అందుతుంది. కార్మికుడి దహన సంస్కారాల ఖర్చుల కోసం రూ. 30 వేలు అందిస్తారు.

● ప్రమాదవశాత్తు అంగవైకల్యం కలిగిన వారికి 2లక్షల నుండి 5లక్షల వరకు పరిహారం అందిస్తారు.

● తాత్కాలిక వైద్య ఖర్చుల కోసం కార్మికులకు నెలకు రూ.4,500 చొప్పున గరిష్ఠంగా రూ.13,500 సహాయం అందుతుంది.


జిల్లా కేంద్రంలో లేబర్ కార్డులపై ధర్నా నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు(ఫైల్)



లేబర్ గుర్తింపు కార్డు నమూనా

అర్హులు కార్డులు తీసుకోవాలి



● దుబాస్ రాములు, తెలంగాణ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు

వివిధ రంగాల్లో కార్మికులుగా పనిచేస్తున్న అర్హులందరు లేబర్ కార్డులు తీసుకోవాలి. కార్డులు లేని చాలా మంది అత్యవసర పరిస్థితుల్లో తీవ్రీ ఇబ్బందులు పడుతున్నారు. లేబర్ కార్డులపై ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు కల్పించి కార్మికులకు కార్డులు అందేలా చర్యలు చేపట్టాలి.

బయోమెట్రిక్ సిస్టం తొలగించాలి



● ఓమయ్య, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి

లేబర్ కార్డుల పొందిన మహిళ ప్రసవానికి రూ.30వేల ఆర్థిక సాయం సకాలంలో అందడం లేదు. బయోమెట్రిక్ సిస్టం వల్ల బాలింతలు బయోమెట్రిక్ పెట్టడం కష్టంగా మారిందన్నారు. బయోమెట్రిక్ సిస్టం తొలగిస్తే మరింత ప్రయోజనం చేకూరుతుంది.


లింగంపేటలోని మత్తడి పోచమ్మ ఆలయం వద్ద రథోత్సవం

ఘనంగా రథోత్సవం

● మత్తడి పోచమ్మ ఆలయం వద్ద రసవత్తరంగా కుస్తీ పోటీలు

లింగంపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మత్తడి పోచమ్మ ఆలయం వద్ద మంగళవారం రాత్రి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారి రథోత్సవాన్ని తిలకించారు. మంగళవారం ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మ వారిని దర్శించుకుని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. బుధవారం కుస్తీ పోటీలు రసవత్తరంగా సాగాయి. కుస్తీ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి కాకుండా నిజామాబాద్, మెదక్, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వస్తాదులు తరలివచ్చారు. మహిళా వస్తాదులు మగవారితో తలపడి మగవారిని మట్టికరిపించారు. దీంతో కుస్తీ పోటీలు చూసేందుకు జనాలు వేలాదిగా తరలివచ్చారు. మహారాష్ట్రకు చెందిన 16 సంవత్సరాల వయస్సు ఉన్న పల్లవి మగవారిని అందులో పెద్ద పెద్దవారిని చిత్తు చేయడం చూసి జనాలు ఆశ్చర్యపోయారు. చివరి కుస్తీ మూడు తులాల వెండి కడియం కుస్తీ పోటీలో సోలాపూర్‌కు చెందిన అక్షయ్ గెలుకోగా, రెండు తులాల వెండి కడియంను సరిచంద్ గెలుచుకున్నారు. వీరి ఆలయ కమిటీ అధ్యక్షుడు అశోక్, గౌరవ అధ్యక్షుడు శంకర్ గౌడ్, మారుతిలతో పాటు నారాగౌడ్, క్రాంతి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా సాగిన ఉత్సవాలు నేటితో ముగిశాయి.


కుస్తీ పోటీలలో మగవారిని చిత్తు చేస్తున్న బాలిక

హెచ్‌సీయూ భూములు అమ్మే నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి

● ఏబీవీపీ ఆధ్వర్యంలో టీయూ బంద్


టీయూలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న విద్యార్థి నాయకులు


ప్రభుత్వ దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహిస్తున్న విద్యార్థి నాయకులు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీ ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ 400 ఎకరాల భూమిని ప్రభుత్వంవేలం ద్వారా అమ్మే నిర్ణయానికి నిరసనగా తెలంగాణ యూనివర్సిటీలో బుధవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మకు పాడె నిర్వహించి దహనం చేశారు. ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు శివ మాట్లాడుతూ.. రాష్ట్రంలో వర్సిటీ భూములను కాంగ్రెస్ ప్రభుత్వం అమ్ముకుంటూ విద్యా వ్యవస్థను నాశనం చేస్తుందని విమర్శించారు. మేధవులంతా ఈ విషయంలో నిమ్మకునీరెత్తిన్నట్లు వ్యవహరించడం సరికాదన్నారు. నిరసన తెలుపుతున్న విద్యార్థి నాయకులపై పోలీసులు దాడులు చేయడం సిగ్గు చేటన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వంస్పందించి వర్సిటీ భూముల అమ్మకం విరమించుకోవలన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ విద్యార్థులు అమృత్‌చారి, సాయికుమార్, సమీర్, అశోక్, అజయ్, అనిల్, పృథ్వి, నరేందర్, రమన, ఉదయ్, సాయి కౌషిక్, అనిల్ పాల్గొన్నారు.

టీయూ కళాశాల ఎదుట ఏఐఎస్ఎఫ్ నిరసన

సెంట్రల్ యూనివర్సిటీ భూములను అమ్మే ఆలోచన ప్రభుత్వం తక్షణమే విక్రయించుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి తన వద్ద విద్యాశాఖ ఉంచుకొని భూములను అమ్మాలను కోవడం సిగ్గు చేటని వర్సిటీ ఏఐఎస్ఎఫ్ కన్వీనర్ సంజయ్ చందు అన్నారు. బుధవారం వర్సిటీ కళాశాల ఎదుట విద్యార్థులతో కలిసి ఆందోళన నిర్వహించారు. విద్యార్థులను అక్రమంగా అరెస్ట్ చేయడం పోలీసులకు, ప్రభుత్వానికి తగదని వర్సిటీల్లో పరిశోధనలు, నాణ్యమైన బోధన దక్షిణ భారత్‌లోనే హెచ్‌సీయూకు మంచి గుర్తింపు ఉందని పేర్కొన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో ఉన్న విద్యార్థులను పోలీసు పాలన చేయడం తగదన్నారు. ఈ నిరసనలో విద్యార్థి నాయకులు చత్రు, భార్గవ్, అజయ్,సుజాత,అమృత, పాల్గొన్నారు.


హెచ్‌సీయూ భూములపై ప్రభుత్వం వెనక్కి తగ్గాలి

నిజామాబాద్ అర్బన్: హైదరాబాద్ సెంట్రల్ యూని వర్సిటీలో 400 ఎకరాల యూనివర్సిటీ భూములను వేలం వేయడం ద్వారా అమ్మే నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని గిరిరాజ్ కళాశాల వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర సహాయ కార్యదర్శి రఘురాం మాట్లాడుతూ సెంట్రల్ యూనివర్సిటీ భూములను చదును చేస్తున్న జేసీబీలను అడ్డుకునేందుకు వెళ్తున్న విద్యార్థులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం సరికాదన్నారు. ప్రజాపాలనలో విద్యార్థులపై ఉక్కుపాద మోపడం ఏంటని ప్రభుత్వం మొండి వైఖరిని వీడి భూముల వేలం వేయడాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షు రాలు అంజలి, నాయకులు నవీన్, కృష్ణ, వంశీ, తదితరులు పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

హెచ్‌సీయూ విద్యార్థుల అక్రమ అరెస్టుకు నిరసనగా ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

సుభాష్‌నగర్: హెచ్‌సీయూ విద్యార్థుల అక్రమ అరెస్టుకు నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ వద్ద ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు మాట్లాడుతూ హెచ్‌సీయూ విద్యార్థులు తమ పరిధిలోని 400 ఎకరాల భూములను ప్రభుత్వం అమ్మకుండా ఉండాలని నాలుగు రోజులుగా నిరసనలు చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను ప్రయోగించి అక్రమంగా అరెస్టులు చేయిస్తూ నిర్బంధాలకు గురిచేస్తుందన్నారు. ఎస్ఎఫ్ఐ విద్యార్థి కార్యకర్తలపైన మర్డర్ కేసును ప్రయోగించి జైలుపాలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రజలు తమ సమస్యలను శాంతియుతంగా చెప్పుకునే అవకాశం కల్పించకుండా గత ప్రభుత్వం మాదిరిగానే నిర్బంధాలతో అణచాలనుకుంటే ప్రభుత్వం తీవ్ర వ్యతిరేకతను మూటకట్టుకునే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం అక్రమ కేసులను ఎత్తివేసి వందల ఎకరాల భూమిని యూనివర్సిటీకి కేటాయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వెంకట్రాములు, నూర్జహాన్, గంగాధర్, విఘ్నేష్, రాములు, దినేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా ఆటిజం దినోత్సవం



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

కామారెడ్డిటౌన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆటిజం దినోత్సవం సందర్భంగా బుధవారం ఐఎంఏ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వ హించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జన్యుపరమైన కారణాలతో ఆటిజం వ్యాధి వస్తుందని తెలిపారు. పిల్లల మానసిక ఎదుగుదల సరిగ్గా జరగక సాధారణ జీవితం గడపడం కష్టమవుతుందని అన్నారు. మహిళలు గర్భిణీగా ఉన్నప్పుడు తీవ్ర ఉద్వేగాలకులోను కావడంతో పాటు ఇన్ఫెక్షన్‌లకు గురవుతారని తెలిపారు. మెదడు ఎదుగుదలకు తోడ్పడే జన్యువులు అందులో స్రవించే సెరటోనిక్, డోపమిన్ వంటి రసాయనాలు తగినంత విడుదల కాకపోవడం, నెలలు నిండకుండా శిశువు పుడితే కూడా ఆటిజానికి గురయ్యే అవకాశాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ప్రముఖ పిల్లల వైద్యులు కేవీగౌడ్, అరవింద్ కుమార్, జీషియన్ డాక్టర్ వెంకట్, ఐఎంఏ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఈఎంటీ దినోత్సవం

కామారెడ్డిటౌన్,ఏప్రిల్ 02(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఈఎంటీ (ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్) దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 108 జిల్లామేనేజర్ తిరుపతి మాట్లాడుతూ 24/7 108 ఉద్యోగులు రాత్రి, పగలు, వర్షం, చలి లెక్కచేయకుండా ఎటువంటి అత్యవసర పరిస్థితినైనా ఎదుర్కొని ప్రజల ప్రాణాలను కాపాడడం ముందుంటారని అన్నారు. ఉద్యోగులు మరింత ఉత్సాహంతో ప్రజాశ్రేయస్సుకు పనిచేయాలని అన్నారు. కార్యక్రమంలో ఈఎంటీలు కృష్ణస్వామి, శంకర్, రాజేందర్, సురేష్, పైలెట్‌లు విజయ్‌కుమార్, బాల నర్సింలు, కార్తిక్, రాజయ్య,ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో భక్తుల పూజలు

బాన్సువాడటౌన్ , ఏప్రిల్ 02 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో బుధవారం భక్తులు అయ్యప్పస్వామికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఉదయం నుంచి అర్చకులు అయ్యప్ప మూల విరాట్టుకు అభిషేకాలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం భక్తుల కోసం అన్నప్రసాద వితరణ గావించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నసురుల్లాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నసురుల్లాబాద్ మండలంలోని మీర్జాపూర్ గ్రామంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ.. కొన్నినెలల క్రితం అనారోగ్య సమస్యలతో బాధపడుతూ చికిత్స చేసుకున్న గ్రామానికి చెందిన కొట్టం మమత 44 వేల రూపాయలు, దయాల్ కావిన్యకు 24 వేల రూపాయల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పురం వెంకట్, నరస గౌడ్, మారుతి, నాగనాథ్, కృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన



ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

బాన్సువాడ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగారం గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను బుధవారం ఎంపీడీవో బషీరుద్దీన్ పరిశీలించారు. గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలని అధికారులకు సూచించారు. అదే విధంగా లబ్ధిదారులకు ఐదువిడతలుగా లక్ష రూపాయల చొప్పున ఐదులక్షలు నేరుగా బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం మత్తులో యువకుడి వీరంగం

లింగంపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎల్లారెడ్డి-కామారెడ్డి రహదారిపై బుధవారం మద్యం మత్తులో వీరంగం సృష్టించాడు. తల్లి, తండ్రిని రోడ్డుపై చితకబాదడమే కాకుండా రోడ్డుపై వెళ్లే వాహనదారులను ఆపి వారిని బైక్, కారులో నుంచి బయటకు లాగుతూ వారిని ఇబ్బందులకు గురిచేశాడు. అరగంటపాటు రోడ్డుపై వాహనాలు ఆగిపోయాయి. దీంతో కోపోద్రిక్తులైన గ్రామస్తులు యువకున్ని చితకబాదారు. అయినా వినిపించుకోకుండా పెద్ద పెద్ద రాళ్ళు తీసుకుని ఎదురు వచ్చిన వారిపైకి విసురుతూ భయభ్రాంతులకు గురి చేశాడు. పోలీసులు స్టేషన్‌కు తరలించారు.

ఎల్లారెడ్డి : రోడ్డుపై న్యూసెన్స్ చేసిన యువకులపై కేసు నమోదు చేసినట్లు ఎల్లారెడ్డి ఎస్ఐ మహేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఎల్లారెడ్డి-బాన్సువాడ ప్రధాన రోడ్డుపై మంగళవారం రాత్రి యువకులు వారి స్నేహితుని పుట్టిన రోజు జరుపుకుంటూ రోడ్డుపై బైక్ పెట్టి, బైక్‌పై కేక్ ఉంచి న్యూసెన్స్ సృష్టించిన యువకులను రాత్రి అదుపులో తీసుకున్నట్లు ఎస్ఐ బొజ్జమహేష్ తెలిపారు. వారి వద్ద బీరు సీసాలు లభ్యం కావడంతో న్యూసెన్స్ కేసు నమోదు చేశామన్నారు. బుధవారం ఉదయం యువకుల తల్లిదండ్రులను పిలిపించి పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా రోడ్లపై పుట్టిన రోజు వేడుకల పేరుతో న్యూసెన్స్ చెస్తే చర్యలు తప్పవన్నారు.

జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ అభియాన్ కార్యక్రమం



కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు

కామారెడ్డి టౌన్,ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో భాగంగా జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు తెలి పారు. బుధవారం కామారెడ్డి పట్టణంలోని పలు వార్డులలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ రాజ్యాంగ విరుద్ధంగా చేస్తున్న పనులను నిరసిస్తు ప్రజలకు వివరిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పండ్లరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్య క్షుడు గోనె శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి కారంగుల అశోకొరెడ్డి, మైనార్టీసెల్ నాయకుడు సిరాజ్, మాజీ కౌన్సిలర్‌లు రాజు, మమత, కన్నయ్య, నాయకులు పాల్గొన్నారు.

మద్నూర్: ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ప్రారం భించిన జైబాపూ, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని మద్నూర్ మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి ప్రజలకు రాజ్యాంగంపై అవగాహన కల్పిస్తామని గుర్తుచేశారు. కార్యక్రమ వివరాలను త్వరలో వెల్లడిస్తామని తెలి పారు. కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగ పరిరక్షణకు కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రచ్చవార్ కుషాల్, పార్టీ అధ్యక్షులు సాయిలు, ఆలయ కమిటీ చైర్మన్ రామ్ పటేల్, మాజీ ఎంపీపీ ప్రజ్ఞా కుమార్, సింగల్ విండో చైర్మన్ శ్రీనివాస్ పటేల్, నాయకులు హనుమాన్లు స్వామి, బండి గోపి ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్

బాన్సువాడ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోర్లం గ్రామంలోని సొసైటీ కార్యాలయం వద్ద బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ సంగ్రం నాయక్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులు పండించిన సన్నధాన్యానికి ప్రతిక్వింటాలుకు 500 రూపాయల బోనస్ ప్రకటించడం జరిగింది. రైతులు పొల్లు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రం వద్దకి తీసుకురావాలని ఆయన సూచించారు. పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ రాజ మణి, సెక్రటరీ సురేందర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు, సొసైటీ డైరెక్టర్లు బాపురెడ్డి గొబ్బురు రాణి, గ్రామ నాయకులు, గ్రామ పెద్దలు, గోపనపల్లి సాయిలు, రాజేశ్వర్ గౌడ్, విద్యాసాగర్ రెడ్డి, జనార్దన్ రెడ్డి ,సయ్యద్, జలీల్, మన్నె చిన్న సాయిలు, గడ్డం వెంకా గౌడ్, డాక్టర్ సాయిలు, సంగం సాయిరెడ్డి, సయ్యద్, సులేమాన్, సయ్యద్, అమీన్, మద్ది బాలరాజ్, జగ్గా ఆనంద్, గుజ్జరి గంగారాం, మోచి గంగారాం, పోతురాజు, సాయిలు పాల్గొన్నారు.

నసురుల్లాబాద్ : రైతులు తాము పండించిన వరి ధాన్యాన్ని దళారులను నమ్మి మోసపోవద్దని మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం శ్యామల అన్నారు. బుధవారం మండలంలోని మైలారం సహకార సంఘ పరిధిలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పండించిన వరి ధాన్యానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోని గిట్టుబాటు ధర లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పెర్క శ్రీనివాస్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, డైరెక్టర్లు, గ్రామస్తులు చంద్రగౌడ్, సాయిరాం యాదవ్, సెక్రటరీ నరేందర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్ : మిర్జాపూర్ సహకార సంఘం ఆధ్వర్యంలో బుధవారం మిర్జాపూర్, వీరాపూర్, రైతునగర్, అన్నారం గ్రామాలలో ధాన్యం కొను గోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. మిర్జాపూర్ సహకార సంఘం అధ్యక్షుడు రాంబాబు స్థానిక నాయకులు, రైతులతో కలిసి కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తమ ధాన్యాన్ని విక్రయించుకుని ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను పొందాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు సంఘం కార్యదర్శి జకీర్ పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట : వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మహిళా సభ్యులు ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ రావు తెలిపారు. బుధవారం ఆయన ఐకేపీ కార్యాలయంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ గురించి కొనుగోలు కేంద్రాల మహిళా కమిటీ సభ్యులకు, వీవోఏలకు ఐకేపీ సిబ్బందికి అవగాహన కల్పించారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఐకేపీ ఆధ్వర్యంలో మహిళల ద్వారా వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మహిళలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆయన కోరారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి నాణ్యత ఉన్న వరిధాన్యం సేకరించాలన్నారు. కార్య క్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు బేస్త శాంత, ఐకేపీ ఏపీఎం జగదీష్ కుమార్, సీసీలు పాల్గొన్నారు.

లింగంపేట : మండలంలోని ఆయా గ్రామాలలో సెర్ప్ ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనంగా మంజూరు చేసినట్లు ఏపీఎం శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని భవానిపేట, ముంబాజీపేట, శెట్పల్లిసంగారెడ్డి, నల్లమడుగు, ఐలాపూర్, అయ్యపల్లి, బాణాపూర్, కంచుమల్, కొర్పోల్, మెంగారం గ్రామాలకు మంజూరయ్యాయన్నారు.

మద్నూర్ : మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో గురువారం పొద్దు తిరుగుడు గింజల కేంద్రాన్ని ప్రారంబిస్తున్నట్లు సింగిల్ విండో కార్యదర్శి బాబురావు వెల్లడించారు. మార్క్‌ఫెడ్, నాఫెడ్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా కొనుగోలు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

రామారెడ్డి : మండలంలోని రెడ్డిపేట్ గ్రామంలో ప్రజలకు బుధవారం సన్న బియ్యం పంపిణీ చేశారు. కాంగ్రెస్ మండల నాయకులు మద్దికుంట నర్సాగౌడ్ ప్రారంభించారు. రాష్ట్ర సంక్షేమం కోసం పేదప్రజలకు సన్నం బియ్యం పంపిణీ చేస్తుందని పేర్కొన్నారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీకి చర్యలు

భిక్కనూర్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నిరుపయోగంగా ఉన్న డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేయడానికి వెంటనే చర్యలు తీసుకుంటామని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం భిక్కనూర్‌లో ఆయన లబ్ధిదారులతో మాట్లాడారు. డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లలో నెలకొన్న సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని, లబ్ధిదారుల వివరాలను వెంటనే అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

అనారోగ్యంతో మృతిచెందిన భిక్కనూర్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు నర్సింలు కుటుంబానికి అండగా ఉంటానని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి హమీ ఇచ్చారు. ఈ మేరకు బుధవారం మృతిచెందిన నర్సింల ఇంటికి వెళ్లి ఆయన మృతికి గల కారణాలను తెలుసుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



భిక్కనూర్‌లో బాధితులతో ఎమ్మెల్యే

పరారీలో ఉన్న విలేకరి అరెస్టు

● రిమాండ్‌కు తరలింపు

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : నిషేధిత ఆల్పజోలం కలిగి ఉండి తయారీ, వ్యాపారం చేస్తున్న కేసులో మరో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు కామారెడ్డి ఎస్పీ రాజేష్‌చంద్ర తెలిపారు. ఇటీవల మద్నూర్ పోలీసు స్టేషన్‌లో నమోదు చేసిన కేసులో ముగ్గురిని ఇప్పటికే అరెస్టు చేయగా.. మద్నూర్ గ్రామ వాసి, ప్రధాన దిన పత్రికలో పనిచేస్తున్న విలేకరి శ్రీనివాస్‌గౌడ్ అనే వ్యక్తిని బుధవారం అరెస్టు చేసినట్టు తెలిపారు. నిందితుడు హైదరాబాద్‌లోని టెంపుల్ ఆర్గానిక్ ల్యాబ్ నుంచి ప్రభుత్వ నిషేధిత ఆల్పజోలం కొనుగోలు చేసి అతనికి సంబంధించిన కల్లు దుకాణంలోని కల్లులో కలిపి అధిక లాభాలు సంపాదించాడని చెప్పారు. ప్రజల ప్రాణాలకు హాని కలిగే విధంగా ఆల్పజోలం కలిపి కల్లును విక్రయించిన శ్రీనివాస్‌గౌడ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్పీ వివరించారు.

ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుందాం

● వర్షపు నీటిని ఒడిసి పడదాం
● మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు

బాన్సువాడ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాబోయే వర్షాకాలంలో వర్షపు నీటిని ఒడిసి పట్టుకోవడానికి ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు అన్నారు. బుధవారం బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో ఇంకుడు గుంతల నిర్మాణం పనులను ఆయన ప్రారంభించారు. బాన్సువాడ మున్సిపాలిటీ సమీపంలో ఎండిపోయిన బోరువద్ద బోర్ చుట్టూ ఇంకుడు గుంతను ఏర్పాటు పనులను మున్సిపల్ మేనేజర్ మల్లికార్జున రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూగర్భ జలాలు పెంచడానికి ఇంకుడు గుంతలు ఎంత అవసరమని ఆయన అన్నారు. రోజు రోజుకి నీటి అవసరాలు పెరుగుతుండడంతో ప్రజలు బోరు మోటర్లపై ఆధారపడుతున్నారని, ఈ బోరు మోటర్ రీఛార్జి కావాలంటే ఖచ్చితంగా ప్రతి కుటుంబం ఇంకుడు గుంతను ఏర్పాటు చేసు కోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో వర్షపు నీటిని ఒడిసి పట్టడానికి మున్సిపాలిటీ తర ఫున అనువుగా ఉన్న ప్రభుత్వ స్థలా లలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఇంకుడు గుంతల వల్ల వృథాగా పో యే వర్షపు నీటిని ఇంకుడు గుంతల్లోకి మళ్లించి భూగర్భజలాలను పెంపొందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్ర మంలో మున్సిపల్ సిబ్బంది శ్రీనివాస్ రెడ్డి, తుల శ్రీనివాస్, విట్టల్, మోహన్ పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు

ఉద్యోగాల భర్తీలో అవకతవకల్లో నిగ్గుతేలేనా?

(5వ పేజీ తరువాయి)

ప్రతిపాదికన ఉద్యోగాల భర్తీ చేపట్టినప్పుడు దరఖాస్తుల స్వీకరణ తర్వాత ఎంపిక చేసిన అభ్యర్థుల మెరిట్‌లిస్టును సంబంధిత ప్రభుత్వ కార్యాలయం వద్ద లేదంటే ఎంప్లాయిమెంట్ కార్యాలయం వద్ద లిస్టు ప్రదర్శిస్తారు. వాటిని దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులు పరిశీలించి ఆ తర్వాత ఏమైన అభ్యంతరాలు ఉంటే వాటిని పునపరిశీలించి ఎందుకు ఉద్యోగం రాలేదనే దానిపై సదరు దరఖాస్తుదారులకు వివరిస్తారు. కాని మెడికల్ కళాశాలలో భర్తీచేసిన ఉద్యోగాల విషయంలో మాత్రం మెరిట్ లిస్టు రెండు కార్యాలయాల వద్ద ఎక్కడ ప్రదర్శించలేదు. మెరిట్ లిస్టు ప్రదర్శించకుండానే ముందుగా నియామక పత్రాలు అందించి ఆ తర్వాత మెరిట్ లిస్టును ప్రదర్శించారు. అదికూడా నిరుద్యోగులు ఉన్నతాధికారులకు నాలుగైదు రోజుల కిందట ఫిర్యాదు చేయడంతో నిబంధనలు ఎందుకు పాటించలేదని మెడికల్ కళాశాల అధికారులతో పాటు ఏజెన్సీ నిర్వహకులను అధికారులు ప్రశ్నించారు. ఏజెన్సీ, కళాశాల సిబ్బంది చేసేదేమి లేక మెరిట్ లిస్టును ప్రదర్శించారు. ఈ ప్రక్రియను చూస్తేనే అర్థమవుతుంది ఏ విధంగా నిబంధనలు పాటించారనేది.

మెడికల్ కళాశాలలో లిస్ట్ చూసి అవాక్కైన దరఖాస్తుదారులు

పోస్టుల భర్తీకి సంబంధించి నిబంధనలు పాటించలేదని ఆయా పోస్టులకు దరఖాస్తులకు చేసుకున్న నిరుద్యోగులు ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేయడంతో నిబంధనలు ఎందుకు అతిక్రమించారని ప్రశ్నించడంతో రెండురోజుల కింద మెడికల్ కళాశాలలో మెరిట్ లిస్టును ప్రదర్శించారు. దీంతో ఆ లిస్టు చూసిన పలువురు దరఖాస్తుదారులు అవకయ్యారు. మొదట కళాశాల ద్వారా భర్తీ ప్రక్రియ చేపట్టినప్పుడు స్కూట్ని చేసి అన్ని సర్టిఫికేట్లు ఉండడంతో మెరిట్ లిస్టు ప్రదర్శించారు. అందులో ఎలాంటి రిమార్క్స్ లేకపోగా మెరిట్‌లో ఇప్పుడు ఉద్యోగం రాని వారి పేర్లు వచ్చాయని, అప్పుడు తమకంటే కిందిస్థాయిలో ఉన్న వారు ఇప్పుడు మాకంటే ఎక్కువ మార్కులతో లిస్టులో ఎలా పైకి వచ్చారనేది అర్థం కావడం లేదని దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు.రవి అనే వ్యక్తి సీటీస్కాన్‌కు దరఖాస్తు చేసుకోగా గతంలో 44.5శాతం రాగా ఇప్పుడు 35.5 శాతం వచ్చిందని తాను ఎక్స్‌పిరియన్స్ సర్టిఫికేట్ పెట్టిన కాని రిజక్ట్‌చేశారని ఆరోపించాడు. అరవింద్ అనే వ్యక్తి రేడియోగ్రాఫిక్ టెక్నీషియన్‌కు దరఖాస్తు చేసుకోగా గతంలో అతనికి మెరిట్ వచ్చిందని తెలిపాడు. గతంలో అతనికంటే దిగువ స్థాయిలో 39.5శాతం మాత్రమే ఉన్న వ్యక్తికి ఇప్పుడు 72శాతం వేశారని అతనికి ఇప్పుడు ఉద్యోగం వచ్చిందని ఆరోపించాడు. ఇలా చాలావరకు అభ్యర్థుల ఎక్స్‌పిరియన్స్ సర్టిఫికేట్లు,మార్కులమెమోలు మార్చారని ఆరోపించారు. ఓ ఉద్యోగికి సంబంధించిన కుటుంబీకులకు ఉద్యోగాలు వచ్చేలా చేశారని పేర్కొన్నారు. ఆయా విభాగాలలో ఉద్యోగాలు సాధించిన వారి నైపుణ్యాలను పరిశీలించడంతో పాటు ఒరిజినల్‌సర్టిఫికేట్లు పున: పరిశీలించి తమకు న్యాయం చేయాలని దరఖాస్తులు చేసుకున్న నిరుద్యోగులు కోరుతున్నారు.

అర్హులైన వారికి ఉన్నతాధికారులు న్యాయం చేయాలి

● వినోద్‌నాయక్,ఎస్సీ,ఎస్టీ విద్యార్థిసంఘం జిల్లా అధ్యక్షుడు

మెడికల్ కళాశాలలో భర్తీచేసిన పోస్టులలో పెద్దఎత్తున అవకతవకలు జరిగినట్లు నిరుద్యోగులు తమకు తెలుపడంతో వారితో కలిసి ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేశాం. మెరిట్ లిస్టు వేశాక నియామక పత్రాలు అందించాల్సి ఉండగా నియామక పత్రాలు అందించి మెరిట్ లిస్టు వేయడం ఎంటో అర్థం కావడం లేదు. నియామక ప్రక్రియలో పెద్ద ఎత్తున డబ్బులు తీసుకున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. సమగ్రవిచారణ జరిపి అర్హులైన వారికి ఉద్యోగాలు వచ్చేలా ఉన్నతాధికారులు న్యాయం చేయాలి. ఒకవేళ అర్హులకు న్యాయం జరగకపోతే బాధితులతో కలిసి ఎస్సీ,ఎస్టీ కమిషన్‌కు సైతం ఫిర్యాదు చేస్తాం.

'సన్న బియ్యం పంపిణీ అభినందనీయం'

మద్నూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం పేదలకు అందజేస్తున్న సన్నబియ్యం పంపిణీ కేంద్రాలలో ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని తహసీల్దార్ ముజీబ్ డీలర్లను ఆదేశించారు. మండలకేంద్రంలోని చౌకధరల దుకాణాలను ఆయన బుధవారం తనిఖీ చేశారు. తహసీల్దార్ తో పాటు గిర్దావర్ శంకర్ సిబ్బంది ఉన్నారు.

నసురుల్లాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం పేదలకు చౌకధరల దుకాణాలలో సన్న బియ్యం పంపిణీ చేయడం అభినందనీయమని మైలారం మాజీసొసైటీ చైర్మన్ పెర్క శ్రీనివాస్ అన్నారు.. బుధవారం మైలారం గ్రామంలోని రేషన్‌షాపులో లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం శ్యామల, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, పంచాయతీ సెక్రెటరీ సవిత, గ్రామస్తులు సాయిరాం యాదవ్, జగన్ పాల్గొన్నారు.



మద్నూర్‌లో తనిఖీ చేస్తున్న తహసీల్దార్

దోమకొండ : మండలంలోని అంచనూర్, గొట్టిముక్కుల గ్రామాల్లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు, రేషన్ డీలర్లు, ప్రజలు పాల్గొన్నారు.

భిక్కనూర్: మండలంలోని తిప్పాపూర్, జంగంపల్లి గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సన్నబియ్యం కార్యక్రమాన్ని మద్ది చంద్రకాంత్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి,భీమ్‌రెడ్డి ప్రారంభించారు.

నాగిరెడ్డిపేట : మండంలోని వదల్పర్తి రేషన్ షాప్‌ను బుధవారం తహసీల్దార్ శ్రీనివాస్‌రావు తనిఖీ చేశారు. రేషన్ కార్డుల లబ్ధిదారులకు ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తున్న నేప థ్యంలో ఆయన సన్న బియ్యం పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సన్న బియ్యంను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ ఉన్నారు.

బలహీనవర్గాల కోసం పోరాడిన నాయకుడు పాపన్నగౌడ్

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం పోరాటం చేసిన నాయకుడు సర్వాయి పాపన్నగౌడ్ కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో పాపన్నగౌడ్ వర్ధంతి సందర్భంగా పూలమాలవేసి నివాళ్లు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భువనగిరి స్థానంగా ఎన్నో పోరాటాలు చేసి సమసమాజస్థాపన కోసం పోరాటం చేసిన వ్యక్తి అని అన్నారు. కార్యక్రమంలో అదనపుకలెక్టర్ విక్టర్,జడ్పీ సీఈవో చందర్‌నాయక్, అసిస్టెంట్ బీసీ వెల్పర్ అధికారి చక్రధర్, హస్టల్ వెల్పర్ అధికారి నరేష్, పవన్, స్వప్న, సునిత, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న కలెక్టర్

● సన్నబియ్యం పంపిణీ పరిశీలన

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్నబియ్యం పథకం పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం కలెక్టర్ పరిశీలించారు. బుధవారం కామారెడ్డి మున్సిపాలిటి పరిధిలోని దుకాణం నంబర్ 14లో బియ్యం యొక్క తూకంను పరిశీలించి లబ్దిదారులతో మాట్లాడారు. జిల్లాలో ఉన్న అన్ని ప్రజాపంపిణీ దుకాణాలలో అధికారులతో ఆర్‌డీఓలు,డీఎస్‌వో,ఏడీఎస్‌ఓ, తహాసిల్దార్‌లు, డీటీలు, ఆర్‌ఐలతో తనిఖీలు చేయించారు. అందులో భాగంగా లబ్దిదారులు చెప్పిన పలు అంశాలను తెలుసుకుని ఆనందం వ్యక్తం చేయడంతో పాటు ఇతర సమస్యలను తీరుస్తామని హామీ ఇచ్చారు. జిల్లాలోని ఎస్సీ, బీసీ,విద్యార్థి సంఘాల నాయకులు అంబేద్కర్‌జయంతి, బాబు జగ్జీవన్‌రాం జయంతి ఉత్సవాలకు పెద్దఎత్తున తరలిరావాలని కలెక్టర్‌ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి సంబంధించి ఏర్పాటు, అధికారిక సమన్వయం, ఎస్సీసంఘాల భాగస్వామ్య తదితర అంశాలపై చర్చించారు.

కామారెడ్డి: టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్ వన్ తుది ఫలితాల్లో విజేతగా నిలిచి జిల్లా అధికారి ఉద్యోగానికి ఎంపికయిన జిల్లా బీసీ సంక్షేమ శాఖ జూనియర్ అసిస్టెంట్ కూతురు కొండపల్లి గాయత్రిని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అదనపు కలెక్టర్లు చందర్‌నాయక్, విక్టర్ ఎస్సీ కార్పోరేషన్ ఈడీ దయానంద్ బుధవారం సన్మానించారు.

ప్రభుత్వ భూములు కాపాడాలని వినతి

బాన్సువాడ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): హెచ్‌సీయూకి సంబంధించిన భూమిని కాపాడాలని కోరుతూ బుధవారం బాన్సువాడ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో డీవో సువర్ణకు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు మోచి గణేష్ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ 400 ఎకరాల భూమిని ఆక్రమణ వల్ల యూనివర్సిటీ అభివృద్ధికి ఆటంకం కలుగుతుందని వారన్నారు. దీంతో పాటు ప్రభుత్వ భూమిని భద్రపరచడం, అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడం అత్యావసరమని ఆయన అన్నారు. తగిన విచా రణ జరిపి త్వరిత గతిన చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

ముగిసిన పదోతరగతి పరీక్షలు

జుక్కల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో బుధవారం విద్యార్థులు పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా రాశారు. ఇటీవల జుక్కల్ ప్రభుత్వ హై స్కూల్లో మ్యాస్‌పేపర్ ప్రశ్నలు లీకేజ్ కావడంతో పలువురిని అరెస్టు చేసి రిమాండ్ పంపించిన విషయం తెలిసింది. ప్రశ్నలు లీకేజ్ కావడంతో పోలీసు శాఖ ప్రతిష్టాత్మకంగా సెంటర్ల వద్ద అదనపు పోలీస్ బందోబస్తు ఏర్పా టు చేశారు. అదేవిధంగా విద్యాశాఖకు సంబంధించిన ముగ్గురు అధికారులు సస్పెండ్ కావడంతో అధికారులు చీటీలు రాయకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశా రు. కొత్తవారిని ఇన్విజిలేటర్లుగా నియమించి విద్యార్థులకు పరీక్షలు రాయించారు.

శ్రీ హనుమాన్ దీక్ష సేవాసమితి రాష్ట్ర కార్యవర్గం రద్దు

బాన్సువాడ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత శ్రీ హనుమాన్ దీక్ష సేవా సమితి పాత రాష్ట్ర కార్యవర్గాన్ని రద్దు చేస్తున్నట్లు హనుమాన్ దీక్ష పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ దుర్గాప్రసాద్ స్వామీజీ మహారాజ్ తెలిపారు. బాన్సువాడ రెవెన్యూ డివిజన్ కేంద్రంలో ఏర్పాటు చేసిన శ్రీ హనుమాన్ దీక్ష స్వాముల 16వ మహా మండల పూజ మహోత్సవంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర పాత కార్యవర్గాన్ని రద్దు చేస్తూ త్వరలో యువ నాయకత్వంతో నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ప్రకటిస్తామని తెలిపారు. హనుమాన్ మాలధరించిన దీక్షా స్వాములు నేరుగా పీఠానికి సంప్రదించవచ్చని సూచించారు. అఖిల భారత శ్రీ హనుమాన్ దీక్ష సేవా సమితి రాష్ట్ర పీఆర్వోగా పురుషోత్తం, జిల్లా ఇన్‌చార్జిగా రోండ్ల ఉపేందర్ రెడ్డిలను నియమిస్తున్నట్లు పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ దుర్గాప్రసాద్ స్వామీజీ మహారాజ్ బహిరంగ సభలో ప్రకటించారు. అతిత్వరలో కమిటీలను నియమిస్తామని ప్రకటించారు.

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	140	170
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

